తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-12-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:107 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

# రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది

- తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, లైన్లను పూర్తి చేసేందుకు సహకారాలు అందిస్తాం
- అవసరమైన నిధులను సమకూర్చటంతో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంలో ముందుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణలో పెండిరగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని సూచించారు.



మిగతా 2లో..

# గ్రూప్-1 అంశంపై అప్పీల్‌కు వెళ్లాలని టీజీపీఎస్సీ నిర్ణయం

## సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లనున్న టీజీపీఎస్సీ

## ఇవాళ జరిగిన టీజీపీఎస్సీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయించాలని (రీవాల్యుయేషన్), లేదంటే పరీక్షలను రద్దు చేసి తాజాగా నిర్వహించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్ణయించింది. ఇవాళ జరిగిన టీజీపీఎస్సీ ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం రీవాల్యూయేషన్ చేస్తే టెక్నికల్ సమస్యలు రావొచ్చని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభిప్రాయపడిరది. మరోవైపు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్‌ను జారీ చేయడంలో, పరీక్ష కేంద్రాల కేటాయింపులో పారదర్శకత లేదని సింగిల్ జడ్జి బుధవారం ఇచ్చిన తీర్పులో తప్పుబట్టారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను, సమగ్రతను కొనసాగించలేదని, పక్షపాతంతో వ్యవహరించినట్లుగా కనిపిస్తోందని, కమిషన్ తన సొంత నియమ, నిబంధనలను సైతం ఉల్లంఘించిందని అందులో పేర్కొన్నారు. గ్రూప్స్ పరీక్షలు రాసిన వారి సంఖ్యపై పొంతన లేని సమాధానాలు చెబుతోందని, మూల్యాంకనం కోసం చేసిన ప్రొఫెసర్ల ఎంపికలోనూ పారదర్శకత పాటించలేదని, ఫలితంగా తెలుగు మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్న విషయం తెలిసిందే.

మిగతా 2లో..

# భాగ్యనగరంలో దంచికొట్టిన వర్షం

- హయత్‌నగర్ వద్ద మునిగిపోయిన జాతీయ రహదారి
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- జలమయమైన రహదారులు, ట్రాఫిక్‌కు అంతరాయం

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

హైదరాబాద్ నగర ప్రజలను వర్షాలు వదలడం లేదు. ఇటీవల కురిసిన కుంభవృష్టి నుంచి తేరుకోకముందే బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో భారీ వర్షం పడిరది. మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో వర్షం సుమారు 2 గంటలుగా కురుస్తోంది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌తో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్ సిటీ పరిసర ప్రాంతాల్లో కుండపోత వర్షం పడిరది. సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షంతో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్‌ఆర్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో భారీ వర్షం పడిరది. భారీవర్షంతో ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు జాతీయ రహదారి వరదనీటితో మునిగిపోయింది. ట్రాఫిక్‌కు ఎక్కడికక్కడ అంతరాయం ఏర్పడిరది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిగతా 2లో..



# పోలీసులపై రైతుల కన్నెర్ర

- రేవంత్ ప్రభుత్వంపై రైతుల తిరుగుబాటు
- అన్నదాతల ఆందోళనకు కారణమైన ఆరు గ్యారెంటీలు
- కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్న రైతులు
- యూరియా కొరత: రాత్రింబవళ్లు పడిగాపులు
- యూరియా కోసం పోలీసుల పహారాలో పంపిణీ
- ఇర్కోడ్ గ్రామంలో ఉద్రిక్తత – పోలీసులు పరారయ్యే పరిస్థితి
- యూరియా బస్తా కోసం అన్నదాతల బాధలు



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలో తిరుగుబాటు మొదలైంది. కాంగ్రెస్ సర్కార్‌పై అన్ని వర్గాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అన్నదాతలు చీల్చిచెండాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు రైతులను నిలువునా మోసం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డిపై అన్నదాతలు భగ్గుమంటున్నారు. సీఎం రేవంత్ పాలన కంటే కేసీఆర్ పాలనే బాగుండే అని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. అంతేకాదు కొంతమంది రైతులు కేసీఆర్‌ను తలచుకుని కన్నీరు పెట్టుకుంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సమస్య తలెత్తిన సంగతి తెలిసిందే. యూరియా కోసం రైతులు వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. సరిపడా యూరియా లేకపోవడంతో పోలీసు పహారా మధ్య అన్నదాతలకు యూరియాను పంపిణీ చేస్తున్నారు. అయితే యూరియా కావాలంటూ ఆందోళనకు దిగిన అన్నదాతలను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. యూరియా అడిగిన తోటి రైతును అరెస్ట్ చేయబోతే మిగతా రైతులందరూ మూకుమ్మడిగా పోలీసులపై తిరగబడ్డారు. సిద్దిపేట మండలం ఇర్కోడ్ గ్రామంలో ఈ ఘటన వెలుగు చూసింది. పోలీస్ గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు అన్నదాతలు. చివరకు అన్నదాతల ఆగ్రహానికి పోలీసులు గురికాక తప్పలేదు. రైతుల మూకుమ్మడి దాడి నుంచి తప్పించుకునేందుకు పోలీసులు యత్నించారు. ఎస్ఐకి కానిస్టేబుల్స్ ప్రొటెక్షన్‌గా నిలిచారు. ఒక్క యూరియా బస్తా కోసం అన్నం, నీళ్లు లేక తిరుగుతున్నాం.. అర్ధరాత్రి వచ్చి పడిగాపులు కాస్తున్నాం అని పోలీసులపై రైతులు మండిపడ్డారు.

# బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు వివరించేందుకు.. చలో కామారెడ్డి

## రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపు

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:



విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని తెలిపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్రంలోని బీసీలంతా సెప్టెంబర్ 15వ తేదీన కామారెడ్డికి లక్షలాదిగా తరలిరావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించామని, అనంతరం బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. గురువారం మంత్రుల నివాస సముదాయంలోని రాష్ట్ర రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో ఈ నెల 15 తేదీన కామారెడ్డి లో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, శాసనసభ్యులు మదన్ మోహన్ రావు తదితరులతో మంత్రి సురేఖ సమావేశం అయ్యారు. కామారెడ్డి సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు.

మిగతా 2లో..

# అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

హైదరాబాద్ నగరంతో పాటు పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. నగరంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలపైన ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చెరువులు, కుంటలకు గండి పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం..

## కుప్పకూలిన పాత కలెక్టరేట్ భవనం



2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో పెండిరగ్ రైల్వే ప్రాజెక్టులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రాజెక్టుల విషయాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో రైల్వేతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్య మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి తోడ్పడే ప్రత్యేక రైల్వే లైనుతో పాటు పలు ప్రాజెక్టుల ను వివరించారు.

ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు.

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు.

కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం తయారు చేసిందన్నారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా ఒకటిన్నర కిలోమీటరు దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు.

కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ బెంగుళూరు హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి గారు రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి గారు అధికారులకు వివరించారు. దాదాపు 362 కి.మీ మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని, దీంతో పాటు గద్వాల డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్ జిల్లాలో రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాల పల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని చెప్పారు. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారు, ఎంపీ కడియం కావ్య గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 అంశంపై అప్పీల్‌కు వెళ్లాలని టీజీపీఎస్సీ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

టీజీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ఆన్సర్? పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ ఇచ్చింది. రీవాల్యుయేషన్ సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్‌ను నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఎనిమిది నెలల్లోగా మళ్లీ మెయిన్స్‌ను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు గతంలో ప్రకటించినటువంటి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. మెయిన్స్? అభ్యర్థుల పేపర్లను మోడరేషన్ విధానంలో రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు నిర్దేశించింది. ఈ నేపథ్యంలోనే ఇవాళ జరిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ప్రత్యేక సమావేశంలో అప్పీలుకు వెళ్లాలని నిర్ణయించింది. సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయాలని నిర్ణయం తీసుకుంది. మరి దీనిపై డివిజన్ బెంచ్ ఏమని తీర్పు ఇస్తుందో ఎదురుచూడాల్సిందే. ఇటీవల కోర్టు తీర్పు వెలువడిన అనంతరం కొంతమంది అభ్యర్థులు స్పందించారు. కోర్టు తీర్పు సానుకూలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం కూడా ఆలోచించి రీవాల్యుయేషన్ కాకుండా ఎగ్జామ్?ను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు వివరించేందుకు.. చలో కామారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అందుకే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసిల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని సమావేశంలో మంత్రులంతా సమిష్టిగా అభిప్రాయపడ్డారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సాధించామని వివరించారు. ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్టాత్మకమైందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవలంభించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించినట్టు వివరించారు.

# భాగ్యనగరంలో దంచికొట్టిన వర్షం

(మొదటి పేజీ తరువాయి)

పలు కాలనీల్లో వరద నీరు రహదారులను ముంచెత్తింది. అటు పంజాగుట్ట, అమీర్ పేట్, మియాపూర్, కొండాపూర్?లోనూ భారీవర్షం ముంచెత్తింది. రోడ్లపై వరదనీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భారీ వర్షానికి విజయవాడ హైదరాబాద్ నేషనల్ హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై మోకాలి లోతు వరకు నీరు భారీగా ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్‌నగర్ నుంచి పట్టణం వైపుగా వెళ్లే వాహనాలు భారీ వరదనీటి కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరోవైపు వాహనదారులు ఇబ్బంది పడకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ప్రజలు ఇంటి నుంచి బయటకు అడుగు తీయాలంటేనే భయపడుతున్నారు. రోడ్లు వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి.



# సుప్రీంకోర్టు నోటీసులు..

## యూటర్న్ తీసుకున్న తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేలు

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ శాసన సభ స్పీకర్‌ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేలు యూటర్న్ తీసుకున్నారు. తాము కాంగ్రెస్‌లో చేరలేదని బీఆర్ఎస్‌లోనే ఉన్నామని స్పష్టం చేశారు.

బీఆర్ ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత నెల 31న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇదే అంశంపై తెలంగాణ స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు పంపించారు. వారి వద్ద నుంచి వివరణ తీసుకున్నారు. స్పీకర్ పంపిన నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు కౌంటర్ దాఖలు చేశారు. కాంగ్రెస్‌లో చేరలేదు.. నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌ను కలిశా.బీఆర్ఎస్‌కు నేను రాజీనామా చేయలేదుపోచారం శ్రీనివాస్ రెడ్డి మా ఫోటోలను మార్ఫ్ చేశారు. నేను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నా.నాది బీఆర్ఎస్ ఐడియాలజీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి





నేను బీఆర్ఎస్‌లోనే ఉన్నా.కాంగ్రెస్‌లో చేరానన్నది అబద్ధం కాలే యాదయ్య

నేను బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నా. కాంగ్రెస్‌లో చేరలేదు. ఇప్పటికి బీఆర్ఎస్‌కే నా మద్దతు గూడెం మహిపాల్

ఇప్పటికి బీఆర్ఎస్‌లోనే ఉన్నా. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిశా అరికెపూడి గాంధీ వివరణిచ్చారు.





# అడవిశ్రీరాంపూర్.. తొలి ఏఐ గ్రామం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు

రాష్ట్రంలో తొలి ఏఐ గ్రామంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ నిలుస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏఐ ల్యాబ్‌తో విద్యలో కొత్తదశ సంతరించుకుంటుందని, భవిష్యత్తు సాంకేతికతలో ఏఐ కీలకమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోనే తొలి ఏఐ గ్రామంగా అడవిశ్రీరాంపూర్‌ను మార్చాలనే ఉద్దేశంతో సీఎస్సార్ నిధులతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో టీఫైబర్ ఏర్పాటు చేసిన గ్రామీణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇది రాష్ట్రంలోనే ఏఐని ఉపయోగించుకునే పాఠశాలగా మారనుందన్నారు. ఇంటింటికీ ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వడాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఛాలెంజ్‌గా తీసుకున్నారని అభినందించారు. రానున్న రోజుల్లో రైతులు స్థానిక అంశాలకు అనుగుణంగా ఏఐ సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణలోనే మొట్టమొదటి ఏఐ హబ్‌ని మంథని నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని.. తరువాత ఇంకొన్నిచోట్ల అందుబాటులోకి తెస్తామని శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఈ సందర్భంగా 100 ఏఐ టూల్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. సూపర్ టీచర్ ఎడ్యూ రిఫార్మ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వీటిని అందించేందుకు సహకరించింది. ఏఐ ల్యాబ్ ఏర్పాటులో భాగంగా గ్రామంలో రూ.1.28 కోట్లతో వెయ్యి ఇళ్లకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లు అందించామని టీఫైబర్ ఎండీ వేణుమాధవ్ తెలిపారు. ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కావడంతో టెన్త్ పాఠాలను ముందుగానే నేర్చుకోవడం సాధ్యమైందని విద్యార్థులు తెలిపారు.

# ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం..

ఆదిలాబాద్, తెలంగాణ ముచ్చట్లు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షాలకు పాత కలెక్టరేట్ భవనం కుప్పకూలిపోయింది. పాత భవనంలో కలెక్టర్ కార్యాలయంలోని పలు శాఖలు పనిచేస్తున్నాయి. ట్రెజరీ కార్యాలయంలోని పాతబడిన పైకప్పు భారీ వర్షానికి ఒక్కసారిగా విరిగిపడిరది. ట్రెజరీ కార్యాలయం ముందు విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసులు తృటిలో ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. కార్యాలయం ఆవరణలోని ర్యాకులపై పైకప్పు పడడంతో అందులోని ఫైల్ సైతం ధ్వంసమయ్యాయి. జిల్లా పర్యటనలో ఉన్న ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో కలెక్టరేట్లో సమావేశానికి వచ్చే సమయానికి ముందు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సాయంత్రం సమయం కావడంతో కార్యాలయం సిబ్బంది, జనం ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.





# ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం

## – మంత్రి జూపల్లి

ఆదిలాబాద్, తెలంగాణ ముచ్చట్లు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న జరిగిన ఘటనలో అమరులు, క్షతగాత్రులైన వారి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యమిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గురువారం ఇంద్రవెల్లిలో గిరిజన అమరవీరుల స్మృతివనాన్ని ప్రారంభించి మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం తిరగబడి అమరులైన వారి జ్ఞాపకార్థం స్మృతివనం ఏర్పాటు చేయాలనే గిరిజనుల చిరకాల స్వప్నాన్ని తమ ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ గోడం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో ఇందిరమ్మ నమూనా గృహాన్ని గురువారం ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఎంపీ నగేశ్‌లతో కలిసి మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంపై మంత్రి హామీలు కురిపిస్తారని నాయకులు ఎదురుచూశారు. అయితే, ఆయన తన ప్రసంగంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను హామీలు ఇవ్వను.. ఎందుకంటే మళ్లీ గెలుస్తానో..? లేదో తెలియదు.. మా పార్టీ గెలుస్తుందో..? లేదో..? తెలియదు. అందుకే హామీలు ఇవ్వను, నా వంతుగా ప్రయత్నం మాత్రం చేస్తా.. నా నియోజకవర్గంలోనూ హామీలు ఇవ్వను.. ప్రజలకు ఏం పనులు కావాలో అవి చేస్తా' అని అన్నారు.




## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్వహణను పరిశీలించెందుకు ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, ట్రాఫిక్ నిర్వహణలో ఉన్న సవాళ్లను మరియు అవకాశాలను గురించి చర్చించారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి మరియు ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలని అన్నారు. రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ సిబ్బందిని అధనంగా నియమించాలని అన్నారు. ముఖ్యంగా నిత్యం ప్రజల మధ్య వుండి బాధ్యతలు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు ప్రజలతో వివాదాలకు పోకుండా మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని అన్నారు. అదేవిదంగా ఎంఫోర్సమెంట్ పై దృష్టి పెట్టాలని అదేశించారు. బాడీవార్మ్ కెమెరాలు ఉపయెగించాలని సూచించారు. సిసిటివి కెమెరాల విస్తరణ, ట్రాఫిక్ సమస్య, సంఘటన సమయంలో ప్రతిస్పందన, జరిమానాల వసూలు, ట్రాఫిక్ పరికరాలపై సమీక్ష జరిపారు. అదేవిదంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వ్యక్తిగత సంస్థలు మరియు మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో సరైన పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల పార్కింగ్ మరియు నిర్వహణను పరిశీలించారు. ఇది కాకుండా, ఇతర ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులపై చర్చించారు.




## తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్!

**వేంసూరు, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా వేంసూరు మండల తహశీల్దార్ కార్యాలయాన్ని కల్లూరు రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ మాణిక్ రావు, నాయబ్ తహశీల్దార్ బంతి రామ్‌లను ప్రజా సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యాలయ అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.



## చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు

**కాప్రాలో ప్రజలు ఆమె త్యాగాన్ని స్మరించి నినాదాలతో నివాళులర్పించారు**

**కాప్రా, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని కాప్రా ప్రజలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, ఆమె చేసిన త్యాగాలను, సమాజానికి అందించిన సేవలను స్మరించారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు “దీరవనిత చాకలి ఐలమ్మ అమర్ హై!”, “జోహార్ చాకలి ఐలమ్మ!” అంటూ నినదిస్తూ, ఆమె ధైర్యాన్ని కొనియాడారు. కాప్రా సర్కిల్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, రజక సంఘం నాయకులు, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పటేల్ నరసింహ, మాజీ అధ్యక్షులు శనిగరం అశోక్, బెలిదే అశోక్, హరినాయక్, దొంతు ప్రభాకర్, జర్నలిస్టులు యావపురం రవి, క్యాసాని సురేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.చాకలి ఐలమ్మ తెలంగాణ గ్రామీణ సమాజానికి ఆదర్శంగా నిలిచిన వీరనారి. జమిందార్ల దౌర్జన్యాలకు, భూమిపై హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో ముందుండి నాయకత్వం వహించింది. మహిళల విద్యాభివృద్ధి, సమానత్వం కోసం చేసిన సేవలు నేటికీ స్మరణీయంగా ఉన్నాయి. తన వ్యక్తిగత సుఖాలను త్యాగం చేసి, సమాజానికి అంకితమైన ఆమె పేరు తెలంగాణ భూపోరాట చరిత్రలో వెలుగొందుతోంది.కాప్రా ప్రాంత యువత ఆమె జీవితం నుంచి ప్రేరణ పొందాలని, సమాజ సేవలో ముందుండాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజలు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఆమె పేరు మీద విద్యా, సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే నా లక్ష్యం: ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి పట్ల కట్టుబడి ఉన్నానని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. గురువారం ఆయన మండల వ్యాప్తంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. బచ్చువారిగూడెం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఊట్లపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేశారు.

మండల కేంద్రంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, రూ.13 కోట్లు 81 లక్షలతో మండల వ్యాప్తంగా బీటీ రోడ్ల పనులు చేపడుతున్నట్టు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పసుపులేటి నాగేశ్వరమ్మకు అత్యవసర శస్త్రచికిత్స కోసం రూ.1.50 లక్షల ఎల్‌ఓసి చెక్కు అందజేశారు.

అలాగే, నారంవారిగూడెం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో రూ.4 లక్షలతో టాయిలెట్ల నిర్మాణానికి, అచ్యుతాపురం పంచాయతీ దిబ్బగూడెం గ్రామంలోని పాఠశాలలో రూ.10 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

"నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తాం" అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పివిఎన్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం అవసరం!

**ఉద్యోగుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలి: ఐఎన్టీయూసీ**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పివిఎన్ సింగరేణి కాలనీలో ఉద్యోగుల కోసం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఇంకా ప్రారంభం కాకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఐఎన్టీయూసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ, నాలుగు సంవత్సరాల క్రితమే నిర్మించినా ఇప్పటికీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం కాకపోవడం బాధాకరం అన్నారు. ఉద్యోగుల సౌకర్యార్థం సూపర్ మార్కెట్, వెజిటేబుల్ మార్కెట్, గ్యాస్ ఏజెన్సీ వంటి వసతులు కల్పించాలన్నారు. కాలనీ నుండి చిన్న అవసరాల కోసం కూడా ఐదు కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తోందని



తెలిపారు.

జేవిఆర్ ఓసి ఫిట్ సెక్రటరీ రామారావు మాట్లాడుతూ, సత్తుపల్లి నుండి అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్నా ఉద్యోగుల సంక్షేమంపై సరైన శ్రద్ధ చూపడం లేదన్నారు.



కిష్టారం ఓసి ఫిట్ సెక్రటరీ బాలాజీ మాట్లాడుతూ, పివిఎన్ సింగరేణి కాలనీలో మౌలిక వసతులను మెరుగుపరచడం అత్యవసరం అన్నారు. ఉద్యోగుల కుటుంబాల సౌకర్యం కోసం యాజమాన్యం కృషి చేయాలని కోరారు.



జేవిఆర్ సిహెచ్‌పి ఫిట్ సెక్రటరీ పొగుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సత్తుపల్లి ప్రాంతం నుండి 16 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం జి.ఎం కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.






## జేవిఆర్ డిగ్రీ కళాశాలలో ప్రేరణా తరగతులు!

**విద్యార్థుల్లో కొత్త జోష్.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని జేవిఆర్ డిగ్రీ కళాశాల సభాగృహంలో గురువారం నిర్వహించిన ప్రేరణా తరగతులు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. జేవిఆర్ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు కూడా పాల్గొని ఆసక్తిగా వినిపించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ చదువుపై దృష్టి, తల్లిదండ్రుల త్యాగం గుర్తింపు, మంచి జీవన నడవడిక యొక్క ప్రాధాన్యం గురించి విద్యార్థులకు స్పష్టంగా సూచించారు. రాజకీయ జీవితంలో ఎదురైన కష్టకాలంలో తన తల్లి మట్టా ఆరోగ్యమ్మ ఇచ్చిన ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ప్రతి బిడ్డ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని మన ఆశయం అని ఎమ్మెల్యే రాగమయి విద్యార్థులకు నూతన స్ఫూర్తినిచ్చారు.

ప్రేరణా తరగతులు తమలో ఆత్మవిశ్వాసం పెంచాయని, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు దోహదపడతాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, బోధక సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, ప్రేరణ బృంద సభ్యులు సుధాకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ వినతి పత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు


**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;**

ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ముదిగొండ మండలం గంగాపురం, చింతకాని మండలం చిన్నమండవ శివారు ప్రాంతంలో పట్టా భూమి అని చెబుతూ అక్రమ వసూలు చేస్తున్న పట్టా పాస్ బుక్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తాసిల్దార్ కరుణాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు చేశారు.... ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కూపన్




లు 200 రూపాయలకి మంజూరు చేస్తుంటే ఇదే అదునుగా భావించి ఒక్కొక్క ట్రాక్టర్ కి ₹1000 వసూలు చేస్తున్నారు , ఇలా ప్రతిరోజు మూడు లక్షల ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నరు, అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సీన్ రేజి చార్జిలు వసూలు చేయడం వలన అధిక భారం పేదవాళ్లకి భారం పడుతుంది.. ఈ ఇసుక అక్రమ వసూలు ఆపాలని, పంట పొలానికి కాకుండా మున్నేరులో ఇచ్చినటువంటి పట్టా పాస్ పుస్తకాలను రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ డిమాండ్ చేసింది.. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చిర్ర ఉపేందర్, గుండ్ల రాంబాబు, చాట్ల రాజేష్, బోనకల్ మండలం ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు అశోక్ మరియు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# డిజిటల్ సర్వేతో తేటతెల్లం కానున్న అన్నపూర్ణ సొసైటీ భూవివాదం

**నిజాన్ని వెలికితీయాలని కార్పొరేటర్ సునీత రాము యాదవ్ డిమాండ్**

**గౌతమ్ నగర్, సెప్టెంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు):**అన్నపూర్ణ సొసైటీ భూవివాదంపై నెలకొన్న గందరగోళానికి ముగింపు పలకాలని, ప్రజలకు నిజాలను తెలియజేయాలని మల్కాజ్గిరి డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శుక్రవారం మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. సొసైటీ లేఅవుట్ ప్రకారం 8 ఎకరాలు మాత్రమే ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 10 ఎకరాలుగా ఎలా మారిందో సభ్యులు సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి, ప్లాట్లను రోడ్లుగా చూపిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలలో డివిజన్ పరిధిలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేస్తూ, కొన్ని వర్గాలు రాజకీయ కక్షతో అపప్రథలు సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. "అన్యాయంగా ఆరోపణలు చేస్తున్న వారు నిజంగా ధైర్యం ఉంటే, అధికారులతో కలిసి సొసైటీని ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి," అంటూ ఆయన సవాలు విసిరారు.

అక్రమంగా ఆక్రమించి అమ్ముకున్న ప్లాట్లకు కొంతమంది రాజకీయ నాయకుల మద్దతు ఉండడం విచారకరమని, దీని వల్ల సామాన్య ప్రజలు నష్టపోతున్నారని అన్నారు.

అన్నపూర్ణ సొసైటీపై ఎలాంటి సందేహాలు లేకుండా, అసలు వాస్తవాలు బయటపడాలంటే కలెక్టర్, ఎమ్మెల్యే సహా సంబంధిత అధికారులు డిజిటల్ సర్వే చేయించి, తప్పుడు ప్రచారాలకు ముగింపు పలకాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు."నిజం వెలుగులోకి రావాలి, ప్రజల్లో స్పష్టత రావాలి, అపోహలు తొలగాలి," అని ఆయన పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, వెస్లీ సొసైటీ ప్రిన్సిపల్ ప్రజల కుమారి గతంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కేసు ప్రస్తుతం న్యాయస్థానంలో కొనసాగుతోందని తెలిపారు. అలాంటప్పుడు ఎలా రోడ్డు నిర్మాణం చేపడతారని ప్రశ్నించారు. ఒకవేళ రోడ్డు నిర్మించాలంటే, సంబంధిత వ్యక్తులతో చర్చించి, నష్టపరిహారం చెల్లించి ముందుకెళితే ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, విజయ వినాయక ఆలయ మాజీ చైర్మన్ నర్సింగ్ రావు, రామాంజనేయ నగర్ కాలనీ అధ్యక్షుడు బొడిద రాజేష్, రెబ్బ వాసు, దేవి తదితరులు పాల్గొన్నారు.ప్రజలకు సందేశం:డిజిటల్ సర్వేతో వాస్తవాలు బయటపడతాయి, తప్పుడు ప్రచారాలకు చెక్ పడుతుంది, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

కార్పొరేటర్ సునీత రాము యాదవ్' పిలుపుతో, అధికారులు తక్షణమే స్పందించి డిజిటల్ సర్వే చేపట్టాలని ప్రజలు, స్థానిక నాయకులు ఒత్తిడి పెంచుతున్నారు.



# నేరడలో సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఆర్థిక & విద్యుత్, ప్రణాళిక శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన గొర్రెముచ్చు నవీన్ కు 36,000/వేల రూపాయల పగిళ్లపల్లి ఉప్పలయ్య 22,500 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన చెక్కును లబ్ధిదారుల్లు అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు కాంగ్రెస్ గ్రామ నాయకులు చెవుల తిరుపతిరావు సిపిఐ గ్రామ నాయకులు షేక్ దస్తగిరి మట్టా రవి సీతారాములు వెంకటరరావు అన్నపురెడ్డి పుల్లయ్య గురవయ్య మట్టా వీధిబాబు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి ద్వారా మునగాల యేసేపుకు ఆర్థిక సహాయం

**దేవరకద్ర,సెప్టెంబర్11(తెలంగాణ ముచ్చట్లు):** దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆధ్వర్యంలో, గుండె శస్త్రచికిత్స కోసం చికిత్స పొందుతున్న అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన మునగాల యేసేపుకు సీఎం సహాయనిధి నుండి రూ. 2 లక్షల 50 వేల ఎల్ఓసి మంజూరు చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారుడి కుమారుడు ఎం. ప్రవీణ్కు ఈ ఎల్ఓసి లెటర్ను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగుల విజయ్ మోహన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె. వేగనాథ్, పరశురాములు, చెన్నకేశవ్, రాములు, బుచ్చన్న యాదవ్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు. మునగాల యేసేపు కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



# నిరుపేద వికలాంగురాలి కుటుంబానికి అండగా పల్లా కిరణ్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం స్థానిక శుక్రవారి పేటలో షేక్ బేబీ (65 సంవత్సరాలు) జన్మతరహా వికలాంగురాలు, ముస్లిం మైనారిటీకి చెందిన నిరుపేద కుటుంబం. ఇటీవలే అనారోగ్యంతో మరణించిన షేక్ బేబీకి దహన సంస్కారాలకు మరియు కుటుంబ అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయం & బియ్యం అందజేసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్, పల్లా చేసిన సహాయానికి పలువురు అభినందించారు.

# మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక సమావేశం

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని సేవల విస్తరణపై చర్చ**

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి సొసైటీ సమావేశం గురువారం రోజున ఘనంగా నిర్వహించబడింది. సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను చర్చించారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.అధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తుండటంతో సిబ్బంది కొరత తీవ్రమైందని, నర్సులు, సపోర్టింగ్ సిబ్బంది, భద్రత సిబ్బంది నియామకాన్ని అత్యవసరంగా చేపట్టాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే బయోమెడికల్ వేస్ట్ నిర్వహణకు బిల్లుల చెల్లింపులు, బోరు వెల్ మరమ్మతులు, నీటి సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఇటీవల జిల్లా కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించి మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.





గత సమావేశంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలుగా లిఫ్ట్ మరమ్మతులు, వైద్య పరికరాల ఏర్పాటు, ఆపరేషన్ థియేటర్ సివిల్ వర్క్స్, ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు, సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు, మెకానైజ్డ్ లాండ్రీ సౌకర్యం, రక్త బ్యాంకు ఏర్పాటుకు చర్యలు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ టీహబ్ ఏర్పాటు వంటి కార్యక్రమాలను గుర్తుచేశారు.

భవిష్యత్‌లో ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్వహణను మెరుగుపరచడం, మురికివాడల్లో కమ్యూనిటీ మెడిసిన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, "సదరం" సర్టిఫికేట్ అవసరమయ్యే రోగుల కోసం ప్రత్యేక సిబ్బంది నియామకం, ఆసుపత్రి పరిసరాల్లో వీధి కుక్కల నివారణ, లయన్స్ క్లబ్ సహకారంతో మౌలిక వసతుల అభివృద్ధి, శుభ్రత కోసం ప్రత్యేక చర్యలు, ల్యాబ్ సదుపాయాల మెరుగుదల, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ రోగులకు ప్రత్యేక కౌంటర్లు, మందుల కొరత లేకుండా సరఫరా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో ఆర్డిఓ శ్యాంప్రకాష్, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ గీత, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత, ఏ.ఓ డాక్టర్ సంగీత్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ శివ కిరణ్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ రాధా, ప్రిన్సిపల్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎం బేగ్, లయన్స్ క్లబ్ సభ్యుడు దొంతి శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధి స్వప్న, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, బద్ధం హేమంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పరమేష్, శివ గౌడ్, ఉపేందర్, హేమంత్ పటేల్, శ్రీనివాస్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, నవాబ్, దినేష్, వాసు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.అభివృద్ధి కార్యక్రమాలు త్వరగా అమలులోకి వచ్చి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# 14న 'విత్తనం నుండి మహావృక్షంగా వనజీవి జీవితం' పుస్తకావిష్కరణ

**ముఖ్య అతిథిగా హాజరు కానున్న జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్**




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు:** వర్ధమాన రచయిత నరేష్ జిల్లా రచించిన 'విత్తనం నుండి మహావృక్షంగా వనజీవి జీవితం' పుస్తకావిష్కరణ, పరిచయ సభ ఈ నెల 14న ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో జరుగుతుందని అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వనజీవి రామయ్య జీవిత చరిను నరేష్ జిల్లా పుస్తకంగా మలిచినట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ సీతారాం పరిచయం చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ రచయిత, విమర్శకులు సైదులు ఐనాల, ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద, ప్రముఖ సామాజిక వేత్త కడవెంటి వేణుగోపాల్, ప్రముఖ రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ, ప్రముఖ కవి నయీమ్ పాషా, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ కరెస్పాండెంట్ ఎం.డి జాఫర్ మతీన్, వనజీవి రామయ్య సతీమణి జానకమ్మ పాల్గొనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిలాషులు, సాహిత్య పోషకులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలు వురిమళ్ల సునందకు కీర్తి పురస్కారం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు:**



ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, ఉత్తమ ఉపాధ్యాయురాలు వురిమళ్ల సునందకు 2024 సంవత్సరానికి గాను తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసుత్న్న వారికి ఈ పురస్కారాన్ని అందచేస్తారు. వురిమళ్ల సునంద ఉపాధ్యాయురాలిగా పని చేస్తూనే సాహిత్యంలో రాణిస్తున్నారు. కవయిత్రిగా, రచయిత్రిగా, బాలసాహితీవేత్తగా విశేష కృషిగావిస్తున్నారు. తను పని చేసే ప్రతి పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తూ సాహిత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి ఏటా తన సోదరి వురిమళ్ల పద్మజ పేరుతో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందచేస్తున్నారు. వురిమళ్ల ఫౌండేషన్‌ను 2019లో స్థాపించి లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తలకు భోగోజు సముద్రమ్మపురుషోత్తం స్మారక నగదు పురస్కారాన్ని అందచేస్తున్నారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై ఇటీవలనే భద్రాద్రి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఇటు ఉపాధ్యాయ రంగంలోనూ, అటు సాహిత్య రంగంలోనూ విశేష కృషి గావిస్తున్న వురిమళ్ల సునందకు తెలుగు పురస్కారం లభించింది. ఈ మేరకు తెలుగు యూనివర్శిటీ ప్రకటించింది. ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే ఉత్సవంలో పురస్కారాన్ని సునంద అందుకోనున్నారు. జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, కవులు, రచయితలు సునందకు శభాకాంక్షలు తెలిపారు.



# లంబాడీల ఆత్మగౌరవ శాంతియుత నిరసన ర్యాలీ!

**దమ్మపేట, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** నాగుపల్లి గ్రామం నుంచి దమ్మపేట, మందలపల్లి వరకు లంబాడ సోదరులు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీంతో లంబాడీలు మానసికంగా వేదనకు గురవుతున్నారని నాయకులు విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో గిరిజన సోదరుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

నాగుపల్లి నుంచి దమ్మపేట అప్పారావుపేట రోడ్డుదగ్గర వరకు పాదయాత్రగా వచ్చి, అనంతరం దమ్మపేట తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గిరిజనుల ఐక్యత చెడగొట్టే ప్రయత్నాలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. గిరిజనుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు జరిగాయని, అందరూ ఒక తాటిపైకి వచ్చి చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే జీవో నెంబర్ 3 రద్దు కావడంతో అనేక ఉద్యోగ అవకాశాలు కోల్పోయామని గుర్తు చేశారు.ఈనెల 14వ తేదీన కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరగనున్న లంబాడ హక్కుల సాధన ఆత్మగౌరవ యాత్రలో లంబాడ సోదరులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు రాజేష్, శ్రీనివాసరావు, కేశవ నాయక్, మాజీ సర్పంచ్ ఆంగోతు బాలాజీ, నాగుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఇస్లావతు శ్రీనివాసరావు, ఇస్లావతు పెంటు, మాజీ ఎంపీటీసీ వసంతరావు, భాస్కరరావు, మాజీ సర్పంచ్ కునుస సొత్ రూప్ సింగ్, చిట్టిబాబు, పాద్య నాగేశ్వరరావు, తేజావత్తు శ్రీనివాసరావు, లాకావతు కేశవరావు, ఆంగోతు సర్వేశ్వరరావు, ఆంగోతు రవీంద్ర, జరబ్ల సాయి కుమార్, నువ్వు భార్గవరావు, కెలావతు బాలాజీ, లాకావతు పుల్లయ్య, ధారావతు మహేశ్వరరావు, ఆంగోతు శ్రీనివాసరావు, పాడియా గోపాలకృష్ణ తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం-12- సెప్టెంబర్ 2025





## హైకోర్టు కాలనీ , హెచ్ఎంటి నగర్ లింకు రోడ్డు అభివృద్ధికి రూ.17 లక్షల నిధులు మంజూరు

**ప్రజల సమస్యలపై స్పందించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్**
**త్వరలో నూతన రోడ్డు పనులు ప్రారంభం**

**చిల్కానగర్, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**

హైకోర్టు కాలనీ నుండి హెచ్ఎంటి నగర్ వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా పాడై పెద్ద పెద్ద గుంటలతో మారిపోయి వాకర్లు, ద్విచక్ర వాహన ప్రయాణానికి తీవ్రంగా ఇబ్బందులు కలిగిస్తోందని స్థానికులు పేర్కొన్నారు. సుమారు 25 కాలనీలకు చెందిన ప్రజలు కలిసి కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కు వినతి పత్రం అందజేశారు.ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో ఇరిగేషన్ శాఖ అధికారులను కలిసి రోడ్డు మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.17 లక్షల నిధులను మంజూరు చేసి, ఇరిగేషన్ ఏఈ సుధీర్ తో పాటు కాంట్రాక్టర్‌ను రోడ్డు స్థితిని పరిశీలించేందుకు పంపించారు.కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, "ప్రజల ప్రయాణానికి అంతరాయం కలిగిస్తున్న ఈ సమస్యను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు ప్రారంభించాం. నూతన రోడ్డు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే మా లక్ష్యం" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఎండి గౌస్, ఎండి షఫీ, శ్యామ్ బంటి తదితరులు పాల్గొన్నారు.



## గాంధీనగర్ బస్తీలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ ఫారుఖి అలీ పర్యటన

**విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు**

**కాప్రా, సెప్టెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ గాంధీనగర్ కాలనీలో ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమానికి తోడుగా టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ మానేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారుఖి అలీ 'బస్తీ బాట' కార్యక్రమంలో భాగంగా గురువారం గాంధీనగర్ బస్తీలో పర్యటించారు.కంపెనీ డైరెక్టర్ ఆపరేషన్స్ నరసింహ, జోనల్ చీఫ్ ఇంజనీర్ కామేష్, హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈ ప్రతిమ షోమ్, లోకల్ సైనిక్పురి డీఈ అన్వర్ పాషా, ఏడీఈ రామూర్తి, లోకల్ ఏఈ సత్యనారాయణ, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, లైన్ ఇన్స్పెక్టర్ కాశీరాం, లైన్మన్‌లు వెంకటేష్, శివ కిరణ్, రవి తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.బస్తీలో విద్యుత్‌కు సంబంధించిన సమస్య లను స్థానిక ప్రజలతో కలిసి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కేబుల్ బంచ్‌ల ఏర్పాటు, నూతన విద్యుత్ స్థంభాల నిర్మాణం, పాత విద్యుత్ స్థంభాల తొలగింపు, ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ తీగల సవరణ వంటి సమస్యలను స్థానిక నాయకులు ఎన్ మహేష్, జి సత్యనారాయణ తదితరులు సీఎండి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పై స్పందించిన ముషారఫ్ ఫారుఖి అలీ, వాటిని త్వరగా పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వెల్ఫేర్ మరియు యూత్ అసోసియేషన్ల ప్రతినిధులు ఎన్ మహేష్, జి సత్యనారాయణ, ఎన్ కుమార్, జి కృష్ణ, నరేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు టీజీఎస్పీడీసీఎల్ తీసుకున్న చర్యలకు బస్తీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పాత ఐటీ రిటర్న్ పత్రాలు పడేస్తున్నారా..




ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు బిగ్ అలర్ట్. మీరు ఐటీఆర్ ఫైల్ చేసి రీఫండ్ పొందిన తర్వాత ఆ రిటర్న్‌లకు సంబంధించిన పత్రాలను పడేయడం లేదా చింపేయడం వంటి పొరపాట్లు చేస్తున్నారా? అయితే ఈ కథనం మీకోసమే. ఐటీ రిటర్న్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లను కొన్ని సంవత్సరాల పాటు భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ఎప్పుడైనా మీ పాత ఐటీఆర్ పత్రాలు అడగవచ్చు. అయితే మరి ఎన్ని సంవత్సరాలు పాత ఐటీ రిటర్న్‌ల డాక్యుమెంట్స్ భద్రపరుచుకోవాలి? ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం 1961లో ఐటీఆర్ పత్రాలను ఎన్నేళ్లు భద్రపరచాలి అనేది కచ్చితంగా చెప్పలేదు కానీ, సెక్షన్ 149 ప్రకారం ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం నోటీసులు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. అసెస్మెంట్ ఇయర్ ముగిసిన 8 సంవత్సరాల వరకు ఐటీ శాఖ నోటీసులు పంపించేందుకు వీలుంటుంది. అలాగే విదేశీ ఆదాయ, ఆస్తులు ఉన్న కేసుల్లో అయితే ఇది 16 సంవత్సరాలుగా ఉంటుంది. అంటే ఈ నోటీస్ పీరియడ్ ముగిసే వరకు ఐటీఆర్ పత్రాలను భద్రంగా దాచుకోవాల్సి ఉంటుంది. లేదంటే చిక్కుల్లో పడాల్సి వస్తుంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, వ్యాపారులు తమ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్‌లకు సంబంధించిన రికార్డులను ఏటీఆర్ ఫైల్ చేసిన తర్వాత 8 సంవత్సరాల పాటు భద్రపరచాలని ట్యాక్స్ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఈ 8 ఏళ్లలో ఐటీ శాఖ ఎప్పుడైనా నోటీసులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. ఇక విదేశీ ఆదాయం ఆస్తులు ఉన్న కేటగిరీలో ఉన్న వారికి ఇది 16 సంవత్సరాలుగా ఉంటుంది. ఉదాహరణకు మీరు 202223 ఆర్థిక సంవత్సరంలో ఐటీఆర్ ఫైల్ చేశారు అనుకుందాం. వాటికి సంబంధించిన రికార్డులను 203031 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు భద్రపరచాల్సి ఉంటుంది. ఇక విదేశీ ఆదాయం, ఆస్తులు ఉంటే 203839 ఆర్థిక ఏడాది ముగిసే వరకు ఉండాలి. పాత ఇన్‌కమ్ ట్యాక్స్ రికార్డులను భద్రపరిచేందుకు చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ఏదైనా తప్పులు దొర్లినప్పుడు మీరు రివైజ్డ్ రిటర్న్‌లు ఫైల్ చేసేందుకు ఉపయోగపడతాయి. గత సంవత్సరాల్లో వచ్చిన నష్టాలు, మినహాయింపు క్లెయిమ్స్‌ను ముందు సంవత్సరాలకు బదిలీ చేసేందుకు అవకాశం లభిస్తుంది. ఇక వ్యాపారాల విషయానికి వస్తే ట్యాక్స్ ఆడిట్ రూల్స్ ప్రకారం కనీసం 8 ఏళ్లు పత్రాలు భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ట్యాక్స్ విభాగం నుంచి నోటీసులు అందినప్పుడు అన్ని డాక్యుమెంట్లు భద్రంగా ఉంటే సరైన సమాధానం అందించేందుకు వీలు కలుగుతుంది. ట్యాక్స్ పేయర్లు తమ ఐటీఆర్ ఫైల్ చేసిన తర్వాత తమ శాలరీ, రెంట్, ప్రాపర్టీ ట్రాన్సాక్షన్లకు సంబంధించిన ఫారం 16, 16ఏ, 16బీ, 16సీ భద్రపరుచుకోవాలి. అలాగే యాన్యువల్ బ్యాంక్ స్టేట్మెంట్, పెట్టుబడుల ధ్రువీకరణ పత్రాల వంటివి ఉండాలి. క్యాపిటల్ గెయిన్స్ ఉంటే వాటి రికార్డులు, ఆస్తుల అమ్మకం కొనుగోలు పత్రాలు ఉండాలి. అలాగే లోన్ వడ్డీ సర్టిఫికెట్లు, రెట్ రిసిప్టులు, హెచ్ఆర్ఏ క్లెయిమ్స్, దివ్యాగుల ప్రత్యేక అలవెన్స్ ప్రూఫ్స్ వంటివి ఉండాలి.

# గంటల వ్యవధిలోనే ఓవర్ సబ్‌స్కైబ్ అయిన అర్బన్ కంపెనీ ఐపీఓ




ప్రముఖ హోమ్ సర్వీసెస్ కంపెనీ అర్బన్ కంపెనీ ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) బుధవారం ప్రారంభమైంది. అయితే, ఇన్వెస్టర్ల నుంచి ఊహించని స్థాయిలో స్పందన రావడం విశేషం. ఐపీఓ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే పూర్తిగా సబ్‌స్కైబ్ అయింది. బిడ్డింగ్ మొదటి రోజున ఈ ఇష్యూకు పెట్టుబడిదారుల నుంచి వచ్చిన స్పందనకు మధ్యాహ్నం సమయానికే ఇష్యూ మొత్తం 1.27 రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్టు ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది. రిటైల్, నాన్ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా పూర్తిస్థాయిలో సబ్‌స్క్రైబ్ అయింది. మొత్తం 10.68 కోట్ల షేర్లను ఐపీఓ భాగంగా విక్రయానికి ఉంచగా, 13.54 కోట్లకు పైనే బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా దాదాపు 4 రెట్లు, నాన్ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 1.6 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్ బయర్స్ విభాగం 20 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యింది. కంపెనీ రూ. 1,900 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఆఫర్‌కు వచ్చింది. ఒక్కో షేర్ ధరను రూ. 98103గా నిర్ణయించింది. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 854 కోట్లను సేకరించిన తర్వాత ఐపీఓ కింద రూ. 1,428 కోట్ల విలువైన షేర్లను అమ్మకానికి ఉంచింది. ఐపీఓలో వచ్చిన నిధులను కంపెనీ క్లౌడ్ ఇన్‌ఫ్రా, ఆఫీసుల లీజింగ్ చెల్లింపులు, మార్కెటింగ్, టెక్ అభివృద్ధి, సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తామని వెల్లడిరచింది.

# అనిల్ అంబానీకి ఈడీ మరో షాక్




రిలయన్స్ గ్రూప్ సంస్థల అధినేత అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో షాక్ ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)ను రూ.2,929.05 కోట్లకు మోసం చేసిన రుణ కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) డైరెక్టర్‌గా ఉన్న అనిల్ అంబానీపై ఈడీ కొత్త కేసు నమోదు చేసింది. అనిల్ అంబానీతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు, ఇతరుల పైనా కేసు నమోదయ్యిందని తెలుస్తోంది. గత నెలలో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఎస్‌బిఐ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పలు బ్యాంకులకు అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్‌కామ్ రూ.40 వేల కోట్లకు పైగా రుణాలు బకాయిలుపడిరది. 2018 నాటి గణాంకాల ప్రకారం ఒక్క ఎస్బీఐనే రూ.2929 కోట్ల మేర నష్టపోయింది. ఆర్‌కామ్ అనుకూలంగా రుణాలు పొందేందుకు ఎస్బీఐను తప్పుదోవ పట్టించారు. ఈ నేరపూరిత కుట్రలో కంపెనీ డైరెక్టర్లు సహా పలువురు అధికారులు పాలుపంచుకున్నారని ఈడీ నిర్ధారణకు వచ్చింది. బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకుని మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ప్రారంభించగా.. సీబీఐ కూడా సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు అంశంలో ఆగస్టులో అనిల్ అంబానీని ఈడీ 10 గంటల పాటు ప్రశ్నించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్బీఐ నిర్ణయించిన విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను మోసపూరితమైందని గుర్తించిన తర్వాత ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్బీఐకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కేసును సీబీఐ, పోలీసులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఎస్బీఐ ఫిర్యాదు మేరకు సీబీఐ, ఈడీ కేసు నమోదు చేసింది.

# భారత్‌లోకి బీవైడీ ప్రవేశం..!



మన దేశంలో తన బీవైడీ అట్టో 2 కాంపాక్ట్ సెడాన్‌ను విడుదల చేసే సన్నాహాల్లో నిమగ్నమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా సుంకాలు విధించిన ప్రస్తుత పరిస్థితుల్లో, సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు చైనా, భారతదేశాలు ఆసక్తిగా ఉన్న విషయం విదితమే. ఇంతకుముందు చైనా సంస్థలపై మన ప్రభుత్వం కూడా అంత సానుకూలంగా లేదు. మారిన పరిస్థితుల్లో బీవైడీ తన ఉన్నత స్థాయి అధికార్ల బృందాన్ని చైనా నుంచి మనదేశానికి పంపిస్తోంది. మన దేశంలో బీవైడీ తన కార్లను కొన్నేళ్లుగా విక్రయిస్తోంది. కానీ దిగుమతి చేసుకునే కార్లపై భారీగా సుంకం పడుతున్నందున, ఈ కార్ల ఖరీదు ఎక్కువై, వినియోగదార్లు పెద్దగా కొనడంలేదు. ఇక్కడే కార్లు తయారు చేయటానికి బీవైడీ ఆసక్తికరంగా ఉన్నా, అందుకు అనుమతులు లభించలేదు. తాజా పరిస్థితుల్లో, మనదేశంలో విస్తరించడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడంలో బీవైడీ నిమగ్నమైంది. వచ్చే 6 నెలల్లో అట్టో 2 మోడల్ కారును తక్కువ ధరలో మనదేశంలో విడుదల చేయాలని ఈ సంస్థ భావిస్తోంది. తద్వారా దేశీయ దిగ్గజాలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలకు గట్టి పోటీ ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది. దీనికి ముందుగా స్థానిక పరిస్థితులను అధ్యయనం చేయడం, ప్రభుత్వ అధికార్లతో సంప్రదింపులు చేపట్టేందుకు తన ఉన్నతాధికార్ల బృందాన్ని ఇక్కడకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. బీవైడీ ఇండియా ఎండీ కెట్సు రఞాగ్ కూడా ఈ బృందంలో ఉంటారని సమాచారం. లిథియమ్ ఆయాన్ బ్యాటరీ ఉత్పత్తి కోసం అదానీ గ్రూపుతో బీవైడీ సంప్రదింపులు సాగిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ఒలెక్ట్రా సంస్థతో బస్సుల తయారీ భాగస్వామ్య ఒప్పందం ఎన్నో ఏళ్లుగా బీవైడీకి ఉంది. ట్రక్కుల ఉత్పత్తి కోసం బీవైడీ, హైదరాబాద్‌కే చెందిన మరొక సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాలతో నిమిత్తం లేకుండా మనదేశంలో సొంతగా కార్ల తయారీ ప్రారంభించాలని, అవసరమైతే ఏదైనా స్థానిక సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని బీవైడీకి ఉంది.


## సంస్కరణలతో భవిష్యత్తు ప్రపంచ అనిశ్చితిని భారత్ తట్టుకోగలదు



భౌగోళిక రాజకీయ పరిణామాలు కొనసాగే అవకాశం ఉన్నందున భారత్ చేపడుతున్న సంస్కరణలు భవిష్యత్తులో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు దన్నుగా ఉంటాయని ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ అన్నారు. ఇప్పటికే గ్లోబల్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాం. వృద్ధి అనుకున్న దానికంటే మెరుగ్గా వచ్చినా ఆశ్చర్యపోవక్కరలేదన్నారు. బుధవారం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలు అమెరికా విధించిన అధిక టారిఫ్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సహాయపడతాయి. ముఖ్యంగా దేశ జీడీపీ వృద్ధికి 0.2 శాతం నుంచి 0.3 శాతం సహకారం లభిస్తుంది. జీఎస్టీ ప్రయోజనాలు వస్తువుల ధరలను తగ్గించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకే కాదు, దీన్ని ప్రైవేట్ రంగానికి బదిలీ కావాలని నాగేశ్వరన్ అన్నారు. ప్రభుత్వం తన వంతు పాత్ర పోషించినప్పటికీ, ప్రైవేట్ రంగం ఉత్పాదకత, విస్తరణపై ఆధారపడి ఫలితాలు ఉంటాయి. తద్వారా వృద్ధికి ఎక్కువ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నోటి చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుందా?



చిగుళ్ళలో రక్తస్రావం అనేది దంత ఆరోగ్యానికి మాత్రమే సంబంధించినదని అందరూ అనుకుంటారు. కానీ దీని వెనుక వివిధ కారణాలు ఉన్నాయని మీకు తెలుసా? గుండె జబ్బు ఉన్నవారిలో చిగుళ్ళలో రక్తస్రావం జరుగుతుందని ఇటీవలి అధ్యయనాలు వెల్లడిరచాయి. హార్వర్డ్ హెల్త్ నిర్వహించిన ఈ అధ్యయనం మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడిరచింది. నోటి ఆరోగ్యం మంచిది కాకపోయినా, పేలవంగా ఉన్నా గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుందని పేర్కొంది. ఎందుకంటే చిగుళ్ళకు, గుండెకు మధ్య ఎలాంటి సంబంధం ఉంటుందో అని అందరూ అనుకుంటారు. కానీ పరిశోధకులు దీని గురించి మరింత సమాచారం అందించారు. నోటి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో కొన్ని విషయాలు కూడా పంచుకున్నారు. కొంతమందికి పళ్ళు తోముకునేటప్పుడు, తినేటప్పుడు చిగుళ్ళ నుంచి రక్తస్రావం జరుగుతుంది. ఇది క్రమం తప్పకుండా జరిగితే మందులు తీసుకుంటారు. అది నయమైతే అంతటితో వదిలేస్తారు. కానీ హార్వర్డ్ హెల్త్ వెల్లడిరచిన సమాచారం ప్రకారం..చిగుళ్ళలో వాపు, రక్తస్రావం వంటి సమస్యలను ఎదుర్కొనే వ్యక్తికి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వెల్లడిరచింది. చిగుళ్ల వ్యాధికి, గుండె జబ్బులకు ప్రత్యక్ష సంబంధం ఉందా లేదా అనేది స్పష్టంగా తెలియదు. కానీ పరిశోధకులు దీనికి ఒక కారణం ఉందని చెబుతున్నారు. చిగుళ్లలో రక్తస్రావం కలిగించే బ్యాక్టీరియా దీనికి కారణం. అదే బ్యాక్టీరియా నోటి ద్వారా రక్తప్రవాహంలోకి ప్రవేశించి రక్త నాళాలలో వాపును పెంచుతుంది. ఫలితంగా ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇవన్నీ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. ఇది బ్యాక్టీరియా వల్ల మాత్రమే కాదు. చిగుళ్లలో రక్తస్రావం అయినప్పుడు, రోగనిరోధక వ్యవస్థ కూడా క్షీణిస్తుంది. ఈ ప్రతిచర్య రక్త నాళాలను దెబ్బతీస్తుందని పరిశోధకులు తెలిపారు. గుండెకు, దంతాలకు హాని కలిగించే అలవాట్ల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ధూమపానం ప్రధాన కారకం. కొన్ని సందర్భాల్లో వంశపారంపర్యంగా కూడా ఇలా జరుగుతుంది. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం, ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల నోటి ఆరోగ్యమే కాకుండా గుండె ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుంది. కానీ చిగుళ్ళ నుంచి రక్తస్రావం కావడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వీటిని అశ్రద్ధ చేయకూడదు. నోరు బ్రష్ చేసుకున్నప్పుడు చిగుళ్ళ నుండి రక్తం కారుతుంది. దుర్వాసన కూడా వస్తుంది. ఆహారాన్ని నమలడం ఇబ్బందిగా ఉంటుంది. దంతాలు సాధారణం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. కొన్నిసార్లు అవి ఊడిపోయే అవకాశం కూడా ఉంది. కొన్ని అలవాట్లు కూడా ఈ సమస్యకు కారణమవుతాయి. అధికంగా ధూమపానం, గుట్కా నమలడం వల్ల ఈ సమస్య వస్తుంది. వీటివల్ల నోటిలో బాక్టీరియా ఏర్పడుతుంది. దీంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. ఫలితంగా గుండె జబ్బులు వస్తాయి. అధిక రక్తపోటు ఉన్నవారికి చిగుళ్ళ నుంచి రక్తస్రావం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఊబకాయం కూడా దీనికి కారణం కావచ్చు. శరీరంలో ఎక్కువ కొవ్వు పేరుకుపోయినప్పుడు ఈ రకమైన సమస్య వస్తుంది. ఇది మాత్రమే కాదు, ఎక్కువ చక్కెర తీసుకోవడం వల్ల కూడా ఈ సమస్యలు వస్తుంది. కానీ మీరు నోటి ఆరోగ్యాన్ని కాపాడుకుంటే అలాంటి సమస్యలను నివారించవచ్చు. రోజుకు కనీసం రెండుసార్లు పళ్ళు తోముకోవడం చాలా అవసరం. మృదువైన బ్రష్‌లు మాత్రమే ఉపయోగించాలి. మూడు నెలల కంటే ఎక్కువ కాలం బ్రష్‌ను ఉపయోగించకూడదు. ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్ట్‌ను ఉపయోగించాలి. మౌత్ వాష్‌ను ఉపయోగించడం మంచిది. అంతేకాకుండా క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించుకోవడం వల్ల ఈ సమస్య రాకుండా నిరోధించవచ్చు.

# ఆ సమస్యలు ఉన్నాయా.? కాలీఫ్లవర్ తింటే.. అంతే సంగతులు..



కాలీఫ్లవర్‌లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కానీ ప్రతిరోజూ కాలీఫ్లవర్ తినడం కొంత మందికి కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అందుకే ఈ సమస్యతో బాధపడేవారు కాలీఫ్లవర్ తినకుండా దూరంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీరు గ్యాస్, ఎసిడిటీ సమస్యలతో బాధపడుతుంటే క్యాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. క్యాలీఫ్లవర్‌లో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి జీర్ణ సమస్యలను పెంచుతాయి. అలాగే మీరు థైరాయిడ్ సమస్యలతో బాధపడుతుంటే కాలీఫ్లవర్ తినకండి. ఇది మీ సమస్యలను మరింత పెంచవచ్చు. కాలీఫ్లవర్ తినడం వల్ల థైరాయిడ్ గ్రంథి అయోడిన్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల సమస్యలు తలెత్తుతాయి. కాలీఫ్లవర్ ముఖ్యంగా ౧3, ౧4 హార్మోన్ల స్థాయిలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ రోగులు కాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. మీకు గాల్ బ్లాడర్, కిడ్నీలో రాళ్లు ఉన్నట్లయితే కాలీఫ్లవర్ తినకపోవడమే మంచిది. కాలీఫ్లవర్‌లో క్యాల్షియం ఉంటుంది. ఇది రాళ్ల సమస్యను పెంచుతుంది. అలాగే మీకు రక్తం గడ్డకట్టే సమస్యలు ఉంటే కాలీఫ్లవర్ తినవద్దు. కాలీఫ్లవర్‌లో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలోని రక్తాన్ని చిక్కగా చేస్తుంది. కాబట్టి ఇలాంటి వారు కాలీఫ్లవర్ అస్సలు తినకూడదు. గర్భధారణ సమయంలో కాలీఫ్లవర్ తినకూడదు. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా గర్భధారణ సమయంలో గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి క్యాలీఫ్లవర్‌ను నివారించడం చాలా ముఖ్యం.

# పిల్లలకి డైపర్స్ వల్ల ర్యాషెస్ వస్తున్నాయా.?



పిల్లల చర్మం ఎంతో సున్నితంగా ఉంటుంది. పుట్టిన దగ్గర నుంచి ఐదు సంవత్సరాల వయసు వరకు పిల్లల్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుతూ ఉండాలి. కొద్ది పాటి వాతావరణ మార్పులు అయినా..పిల్లల్లో అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. అలాగే బయటకు వెళ్లినప్పుడు..రాత్రి సమయంలో.. పిల్లలకు డైపర్స్ వేస్తూ ఉంటారు. ఈ డైపర్స్ కారణంగా కొందరి పిల్లలో ర్యాషెస్ అనేవి వస్తూ ఉంటాయి. ఈ డైపర్స్ అందరికీ పడవు. కొందరిలో ర్యాషెస్, దద్దుర్లు వంటివి వస్తాయి. దీంతో కంగారు పడి వెంటనే ఆస్పత్రులకు తీసుకెళ్తారు. కానీ ఈ టిప్స్‌తో డైపర్ ర్యాషెస్ తగ్గించవచ్చు. డైపర్ ర్యాషెస్, దద్దుర్లను తగ్గించడంలో తల్లిపాలు ఎంతో చక్కగా పని చేస్తాయి. తల్లి పాలలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. తల్లి పాలను దద్దుర్లు, ర్యాషెస్ ఉన్న చోట రాయడం వల్ల ఈ ర్యాషెస్ తగ్గుతాయి. కొబ్బరి నూనెతో కూడా డైపర్ ర్యాషెస్, దద్దుర్లను తగ్గించవచ్చు. కొబ్బరి నూనెలో కూడా మంచి పోషకాలు ఉంటాయి. డైపర్ వేసే ముందే కొబ్బరి నూనె రాసి వేయడం వల్ల మంట, దురద, అసౌకర్యం తగ్గుతాయి. వాజెలీన్‌తో సహాయంతో కూడా డైపర్ వేయడం వల్ల వచ్చే దద్దుర్లు, మంట, దురద, ర్యాషెస్‌ను తగ్గించుకోవచ్చు. వాజెలీన్ చర్మాన్ని మెత్తబరచి.. సమస్య తగ్గేలా చేస్తుంది. ఇవన్నీ పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని అంటున్నారు నిపుణులు.



# సామలు... ఆరోగ్యానికి అమృతమే..!

సామలు అనేవి చిరుధాన్యాల కోవకు చెందిన ఒక రకమైన గింజలు. వీటిని ఆంగ్లంలో లిటిల్ మిల్లెట్ అంటారు. భారతదేశంలో వీటిని అనేక ప్రాంతాల్లో పండిస్తారు, ఆహారంగా ఉపయోగిస్తారు.సామలు అద్భుతమైన సిరి ధాన్యాలు. వీటి ఉపయోగంతో శరీరానికి ఎన్నో లాభాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో పీచు పదార్థం, ఖనిజాలు విటమిన్లు, పుష్కలంగా ఉంటాయి. సామలు సహజంగా గ్లూటెన్ రహితమైన ఆహారం. గ్లూటెన్ పడని వారికి ఇది ఉత్తమమైన ఎంపిక. గోధుమలు, బార్లీ వంటి వాటికి బదులుగా సామల వాడకంతో జీర్ణ సంబంధిత సమస్యలు రావు. గ్లూటెన్ లేని ఆహారం తీసుకోవాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపిక. సామలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పేగు కదలికలను సాఫీగా చేస్తుంది. సామలలో మెగ్నీషియం ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. విటమిన్ బీ3 (నియాసిన్) కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. సామలు తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. కాబట్టి, మధుమేహం ఉన్నవారు వీటిని తీసుకోవడం చాలా మంచిది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. సామలలో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, బి విటమిన్లు వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలు బలంగా ఉండటానికి శరీరంలోని ఇతర ముఖ్యమైన విధులకు తోడ్పడతాయి. సామలలో ఫాస్పరస్ ఉంటుంది, ఇది కొవ్వుల జీవక్రియ, శరీర కణజాలాల మరమ్మత్తు, శక్తి ఉత్పత్తికి సహాయపడుతుంది. మానవ శోషరస వ్యవస్థను శుద్ధి చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, సామలు మెదడు, గొంతు, రక్తం, థైరాయిడ్, క్లోమ గ్రంథి క్యాన్సర్లతో పోరాడటానికి సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తాయి.

# రాత్రి భోజనం తర్వాత రోజూ 2 యాలకులు తినండి..



రోజంతా పనిచేసి అలసిన శరీరం రాత్రి నిద్రపోవడానికి ఆసక్తి చూపిస్తుంది. అయితే కొంతమంది రాత్రి భోజనం చేసిన తర్వాత గ్యాస్, అసిడిటీ లేదా ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటి వారు మెడిసిన్స్ కు బదులుగా వంట గదిలో ఉండే వస్తువులనే తీసుకోవడం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది. ఆ మసాలా దినుసు యాలకులు. చాలా మంది యాలకులను టీ, బిర్యానీ లేదా ఖీర్ వంటి వాటి వాటికీ రుచిని పెంచే మసాలా దినుసుగా భావిస్తారు. అయితే వాస్తవానికి ఈ చిన్న సువాసనగల యాలకులు ఆరోగ్యానికి ఒక వరం. రాత్రి భోజనం తర్వాత కేవలం రెండు ఆకుపచ్చ యాలకులను నమలడం వల్ల అనేక సమస్యలు నయమవుతాయి.జీర్ణక్రియ మెరుగుపడుతుంది: నేటి బిజీ జీవితంలో తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా జీర్ణ సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. రాత్రి భోజనం తర్వాత రెండు ఆకుపచ్చ యాలకులు నమలడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. యాలకులు ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌లను ప్రేరేపించే అంశాలను కలిగి ఉన్నాయి. ఈ కారణంగా ఆహారం త్వరగా , పూర్తిగా జీర్ణమవుతుంది. ఇది గ్యాస్, ఆమ్లత్వం, ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. నోటి దుర్వాసనను వదిలించుకోండి: దుర్వాసన అనేది ఒక సాధారణ , ఇబ్బందికరమైన సమస్య. రాత్రి ఆహారం తిన్న తర్వాత యాలకులు నమలడం వల్ల ఈ సమస్య పరిష్కారం అవుతుంది. యాలకుల తేలికపాటి సువాసన దుర్వాసనను తక్షణమే తొలగిస్తుంది.శ్వాసను తాజాగా చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటి దుర్వాసనకు ప్రధాన కారణమైన నోటిలో పెరిగే బ్యాక్టీరియాను కూడా చంపుతాయి. నిద్ర లేమి సమస్య నుంచి ఉపశమనం: ఈ రోజుల్లో ఒత్తిడి ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారింది. నిద్రను కూడా ప్రభావితం చేస్తుంది. రాత్రి భోజనం తర్వాత యాలకులు నమలడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. యాలకులు శరీరంలో 'సెరోటోనిన్' అనే హార్మోన్‌ను పెంచే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటాయి. సెరోటోనిన్ అనేది సహజమైన మూడ్ బూస్టర్. ఇది ఒత్తిడిని తగ్గించడంలో , మంచి ,గాఢ నిద్రను పొందడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రణ: అధిక రక్తపోటు అనేది అనేక ఇతర వ్యాధులకు కారణమయ్యే తీవ్రమైన వ్యాధి. యాలకులలో పొటాషియం ,మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. రాత్రి భోజనం తర్వాత యాలకులు తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. బరువు తగ్గడంలో సహాయం: బరువు తగ్గాలనుకున్నవారు రాత్రి భోజనం తర్వాత యాలకులు తీసుకోవడం యోజనకరంగా ఉంటుంది. యాలకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ జీవక్రియను పెంచుతాయి, ఇది కొవ్వును కాల్చే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఇది శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. ఇది బరువు తగ్గడానికి చాలా ముఖ్యమైనది

# ఈ చింతకాయను గుర్తుపట్టారా

## ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలం..!




సీమ చింతకాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. సీమ చింతకాయలో విటమిన్ సి ఉంటుంది. ఇది వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. శరీరం అనేక రకాల వైరస్ బారిన పడకుండా ఇది రక్షిస్తుంది. సీమ చింతకాయలు రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని తినడం వల్ల ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు దూరం అవుతాయి. జ్ఞాపకశక్తి, మానసిక స్థితి, ఏకాగ్రతను పెంచుతాయి. సీమ చింతకాయలో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచి కఫాన్ని తగ్గిస్తుంది. గొంతు, చిగుళ్లు, నోటిపూత నివారణకు ఉపయోగపడుతుంది. సీమ చింతలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలను అరికడుతుంది. సీమ చింత గర్భిణీ స్త్రీలకు మంచి పోషకాలను అందిస్తుంది. నీరసం తగ్గిస్తుంది. ఈ కాయలలో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది తల్లితో పాటు పుట్టబోయే బిడ్డ ఎముకలు సైతం ధృడంగా ఉంచుతుంది. సీమ చింతకాయలు తరచూ తినడం వల్ల మధుమేహం వ్యాధిగ్రస్తులకు కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. సీమ చింతకాయలు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. మీరు రక్తహీనతతో బాధపడుతున్నట్లయితే, సీమ చింతకాయ మీకు మంచి పరిష్కారం. ఈ పండులో ఇనుము (ఐరన్) పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలో రక్త ఉత్పత్తికి సహాయపడి, రక్తహీనత లక్షణాలను తగ్గించడంలో తోడ్పడుతుంది.

# వీడియో గేమ్స్ టెక్నాలజీ యువతకు వరమా..?

ఒక ఎలక్ట్రానిక్ దృశ్యశ్రవణ ఉపకరణ ఇన్‌పుట్ కంట్రోలర్‌ల ద్వారా వినియోగదారులు ఆడుకునే ఆసక్తికర అత్యాధునిక క్రీడను "వీడియో గేమ్" లేదా "వీడియో గేమింగ్" అని పులుస్తున్నాం. ఒక టీవీ సెట్, కంప్యూటర్ మానిటర్, హ్యాండ్‌హెల్డ్ పరికర డిస్ప్లే, టన్ స్క్రీన్ ఉపకరణాలు లాంటి వేదికలే క్రీడా మైదానాలుగా డిజిటల్ మానవుడు ఆడుతున్న ఆధునిక ఆటను వీడియో గేమ్‌గా నేటి యువత అబ్బురపడుతూ ఆడుతున్నది. వినోదం, విరామం, కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం, సామాజిక అనుభవం, పోటీల కోసం యూక్షన్, అడ్వెంచర్, రోల్‌ప్లేయింగ్ గేమ్‌ల వంటి వీడియో గేమ్స్ ఆడడం జరుగుతున్నది. వీడియో గేమ్ ఆడే వ్యక్తిని 'గేమర్' అని అంటాం. 1940ల్లో వీడియో గేమ్ ఆవిష్కరణలకు పునాదులు పడుతూ 1970ల్లో వాణిజ్యపరంగా అందుబాటులోరావడం, 1980లో వీడియో గేమ్స్ సామాన్యులకు సహితం అందుబాటులోకి రావడంతో నేటి పౌర సమాజంతో విడదీయరాని సంబంధాలను సుస్థిరం చేసుకున్నది



ఈ మోడ్రన్ డిజిటల్ క్రీడ. చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్న అసంఖ్యాక వీడియో గేమింగ్ ప్రక్రియలు మారుమూల ప్రాంతాలకు సహితం విస్తరించడం జరిగింది. మైన్‌క్రాఫ్ట్, సూపర్ మారియో బ్రోస్, టెట్రిస్, ఫోర్ట్‌నైట్, ది లెజెండ్ ఆఫ్ జెల్డా లాంటి పలు ప్రఖ్యాత వీడియో గేమ్స్ నేడు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. వీడియో గేమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, వీటి ప్రభావాలను వివరించడం, ఆవిష్కర్తలను గుర్తు చేసుకోవడం, వినోదంతో పాటు విశ్రాంతి/విరామాలకు దోహదపడడం, ఇతరులతో ఆన్‌లైన్‌లో కనెక్ట్ కావడం, టీమ్‌వర్క్‌ను పెంపొందించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం లాంటి అంశాలను సవివరంగా చర్చించడానికి ప్రతి ఏట 12 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు "జాతీయ వీడియో గేమ్స్ దినం" పాటించుట జరుగుతున్నది. మన ముని వేళ్లతో అద్భుత ఆనందాల మైదానంలో విహరింపజేస్తున్న వీడియో గేమింగ్ రోజురోజుకు కటింగ్‌ఎడ్జ్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతున్నది. వీడియో గేమింగ్ డిజిటల్ క్రీడలతో పలు ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో నష్టాలను కూడా నమోదు చేస్తున్నాయి. వీడియో గేమింగ్ వల్ల పలు వరాల లాంటి ప్రయోజనాలు కలుగుతున్నప్పటికీ హద్దులు మీరి మునిగితే పలు అనర్థాలు లేదా శాపాలను కూడా మూటకట్టుకోవలసి ఉంటుంది. వీడియో గేమ్స్ వల్ల వేగంగా స్పందించడం, కమ్యూనికేషన్‌ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెరగడం, చిన్న చిన్న విషయాలకు సహితం స్పందించడం, నాయకత్వ లక్షణాలు/జ్ఞాపకశక్తి పెరగడం, శ్రేయస్సుకు దోహదపడడం, సామాజిక బంధాలు బలపడడం, కొత్త భాషలు నేర్చుకోవడం, క్రిటికల్ థింకింగ్/ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పెరగడం, ఏకాగ్రత పెరగడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు గంటల కొద్ది వీడియో గేమ్స్ ఆడిన వారిలో శారీరక హాని, సామాజిక ఒంటరితనం, శారీరక అనారోగ్యం, మానసిక సమస్యలు, ప్రవర్తనలో మార్పులు, ఆందోళనఅనవసర ఆవేశం పెరగడం, కంటి జబ్బులు, హద్దుమీరితే దురవాటుగా మారి పిల్లలుయువత ఉజ్వల భవిష్యత్తుకు అడ్డుపడుతుంది. డిజిటల్‌ఏఐ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ వీడియో గేమ్‌స్‌ను పరిమిత సమయం ఆడితే ఆనందంతో పాటు మానసిక ఉపశమనం కలుగుతాయి. రోజుకు 30 నిమిషాల కన్న ఎక్కువ సమయం ఆడడం మంచిది కాదు. పిల్లలు, యువత వీడియో గేమింగ్ టెక్నాలజీకి వ్యసనపరులు కాకుండా తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి, ఏ గేమ్ ఆడుతున్నారు, ఎంత సేపు ఆడుతున్నారు అనే విషయాలను నిత్యం తెలుసుకుంటూ ఉండాలి. ఆధునిక టెక్నాలజీని మన ఆరోగ్యకర జీవనశైలిని బలపరిచే విధంగా వాడుతూ ఉండాలి. ప్రతి రోజు మైదాన క్రీడలకు లేదా వ్యాయామ క్రీడలకు, పాఠశాల హోమ్‌వర్క్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరిచి పోరాదు. ఏదైనా అతిగా వాడితే అనర్థమే అని తెలుసుకొని అన్ని రకాల ప్రక్రియలకు పరిమితసమయాలను కేటాయించుకుంటూ డిజిటల్‌ఏఐ నరుడిగా ముందుకు సాగాలి. టెక్నాలజీని మానసికశారీరక ఆరోగ్యానికి అవసరం మేరకు వాడుకుంటూ స్మార్ట్ నరుడిగా రుజువు చేసుకోవాలి.




## షారూఖ్, దీపికాకు భారీ ఊరట..

### ముందస్తు బెయిల్ మంజూరు

బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్, స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెలకు భారీ ఊరట లభించింది. సెక్యూరిటీ ఫీచర్స్ లేని ఓ కారు కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తురంటూ నమోదైన కేసులో రాజస్థాన్ హైకోర్టు వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ ప్రాంతానికి చెందిన అడ్వొకేట్ కీర్తి సింగ్ హ్యూందాయ్ కారును కొనుగోలు చేశారు. అయితే, కొన్న కారులో చాలా డిఫెక్ట్స్ ఉన్నాయని, తాను బ్రాండ్ అంబాసిడర్లను చూసే కారును కొనుగోలు చేశానని, తనకు న్యాయం చేయాలంటూ కీర్తి సింగ్.. షారూఖ్ ఖాన్, దీపికా పదుకొణెతో మరో ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైంది. తాజాగా, బాధితురాలు ఇటీవలే రాజస్థాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ షారూఖ్ ఖాన్ తరపున వాదిస్తూ.. తన క్లయింట్ షారూఖ్ ఖాన్‌కు ఈ కేసుతో నేరుగా ఏమాత్రం సంబంధం లేదని వాదించారు. పటిషనర్ ఆరోపించిన డిఫెక్టులకు అతడు బాధ్యత వహించలేదని తెలిపారు. ఎండార్స్‌మెంట్స్ తయారీ ప్రమాణాలకు బాధ్యతను సూచించవని ఆయన కోర్టుకు విన్నవించారు. అదేవిధంగా దీపికా పదుకొణె తరపున అడ్వొకేట్ మాధవ్ మిత్రా కూడా ఇవే విషయాలను ధర్మాసనం దృష్టి తీసుకెళ్లారు. తన క్లయింట్ దీపికా పదుకొణెకు కార్ల ఉత్పత్తి, నాణ్యత నియంత్రణలో ఎటువంటి పాత్ర లేదని పేర్కొన్నారు. అడ్వొకేట్ కీర్తి సింగ్ చేస్తున్న ఆరోపణలు షారుఖ్ ఖాన్, దీపికా ఎండార్స్‌మెంట్లు, వినియోగదారులను పూర్తి తప్పుదారి పట్టించేలా ఉన్నాయని కామెంట్ చేశారు. ఇరు పక్షాల వాదనలువిన్న రాస్థాన్ హైకోర్టు ధర్మాసనం షారూఖ్ ఖాన్, దీపికా పదుకొణెతో పాటు మరో ఆరుగురిపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్టే విధించింది. కేసులో వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లుగా తీర్పును వెలువరించింది. కేసులో తదుపరి విచారణను కోర్టు సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది.

# డాలర్‌కు ప్రత్యామ్నాయం సాధ్యమా!



డీడాలరైజేషన్ అంటే ప్రపంచ దేశాలు అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థికం, కరెన్సీ నిల్వలలో అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకుని, బదులుగా ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించాలని లక్ష్యంగా పెట్టుకునే ప్రక్రియ. ఇది దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలకు వర్తిస్తుంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో అనేక దేశాలు వివిధ కారణాల వల్ల డీడాలరైజేషన్‌ను అనుసరిస్తున్నాయి. వాస్తవానికి, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రెట్టన్ వుడ్స్ ఒప్పందం ద్వారా చారిత్రక, ఆర్థిక నిర్మాణాత్మక అంశాల కారణంగా అంతర్జాతీయ వాణిజ్యానికి వినిమయ మాధ్యమంగా డాలర్‌ను నిర్ణయించారు. అమెరికాఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్దది, అత్యంత స్థిరమైనది. దాని ఆర్థిక మార్కెట్లు ముఖ్యంగా ట్రెజరీ బాండ్లు సులభంగా కరెన్సీలోకి మార్చుకోవచ్చు. అందుకే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులచే విశ్వసించబడతాయి. చమురుతో సహా చాలా అంతర్జాతీయ వస్తువులు డాలర్లలో ధర నిర్ణయించబడి, వాణిజ్యంలో దాని వినియోగాన్ని బలోపేతం చేస్తున్నాయి. దీనికి తోడు, అమెరికా సంస్థలపై బలమైన నమ్మకం, చట్టపరమైన రక్షణలు, ప్రధానంగా డాలర్లలో పనిచేసే ూఔIఖీ (ూశీషఅ్వ టశీతీ ఔశీతీశ్రీసషఅసవ Iఅ్వ తీపaఅస ఖీఅఅaఅషఱaశ్రీ ఎవశ్రీవష శీఎ ఎబఅఅఱషaఅ్‌ఱశీఅం%) వంటి వ్యవస్థల ప్రపంచ వినియోగం నుండి డాలర్ ప్రయోజనం పొందుతున్నది. ఇటీవల, అమెరికా ఆర్థిక ఆధిపత్యం అనేక దేశాల ఆర్థిక సార్వభౌమాధికారం, భౌగోళిక, రాజకీయలపై పెరుగుతున్న కారణంగా డీడాలరైజేషన్‌ను అనుసరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలకు డాలర్ ఆధారిత వ్యవస్థ ఒక ప్రధాన చోదకశక్తి. అందుకే రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలు ఆర్థిక పరిమితులను నివారించడానికి డాలర్ ప్రత్యామ్నాయాలను వెతకడానికి ప్రేరేపించింది. 2025లో, అమెరికా తన సుంకాల విధానాన్ని గణనీయంగా విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా డజన్ల కొద్దీ వాణిజ్య భాగస్వాములను లక్ష్యంగా చేసుకుంది. అందులో భారతదేశం, బ్రెజిల్ ఇప్పుడు 50% సుంకాలను ఎదుర్కొంటున్నాయి. ఈ రెండిరటికి మించి, కొత్త సుంకాలను పొందుతున్న ఇతర దేశాలలో సిరియా (41%), లావోస్ (40%), మయన్మార్ (40%), తరువాత స్విట్జర్లాండ్ (39%), ఇరాక్ (35%), సెర్బియా (35%) ఉన్నాయి. బంగ్లాదేశ్, కంబోడియా, శ్రీలంక, తైవాన్, వియత్నాం వంటి ఆసియాలోని అనేక దేశాలు 19 20% మధ్య సుంకాలను ఎదుర్కొంటున్నాయి. దక్షిణాఫ్రికా, లిబియా, బోస్నియా%డ% హెర్జెగోవినా దేశాలు 30% 35% వరకు సుంకాలకు లోబడి ఉన్నాయి. ఇది అమెరికా వాణిజ్య చర్యల విస్తృత భౌగోళిక, ఆర్థిక పరిధిని ప్రతిబింబిస్తున్నది. డీడాలరైజేషన్‌కు ఇతర కారణాలు ఏమిటంటే, అనేక దేశాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, ద్రవ్యోల్బణం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు పెంపుదల లేదా కరెన్సీ షాక్‌ల వంటి డాలర్ సంబంధిత అస్థిరతల నుండి తమను తాము రక్షించుకోవాలని ఆలోచిస్తున్నాయి. గ్లోబల్ ఫైనాన్స్‌లో బహుళ ప్రామాణిక కరెన్సీకి కూడా ఒత్తిడి పెరుగుతున్నది. ఇక్కడ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు స్థానిక కరెన్సీల వినియోగాన్ని లేదా చైనా క్రాస్‌బోర్డర్ ఇంటర్‌బ్యాంక్ చెల్లింపు వ్యవస్థ వంటి ప్రత్యామ్నాయ వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నాయి. డాలర్ నుండి వైవిధ్యభరితంగా మారడం ద్వారా, ఈ దేశాలు వాణిజ్యం, ద్రవ్యవిధానం, అంతర్జాతీయ చెల్లింపులపై ఎక్కువ నియంత్రణను పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీనిలో భాగంగా, అనేక దేశాలు అమెరికా డాలర్‌కు బదులుగా వారి స్వంత కరెన్సీలను ఉపయోగించి వాణిజ్యాన్ని ఎక్కువగా నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా సన్నిహిత రాజకీయ, ఆర్థిక సంబంధాలు ఉన్న దేశాలలో లేదా అమెరికా ఆంక్షలను దాటవేయడానికి ప్రయత్నిస్తున్న దేశాలలో ఈ ధోరణి పెరుగుతోంది. చైనా, రష్యా డాలర్ ఆధారిత లావాదేవీలను పక్కదారి పట్టించడానికి వారి స్వంత కరెన్సీలలో (చైనీస్ యువాన్, రష్యన్ రూబుల్) వాణిజ్యాన్ని గణనీయంగా విస్తరించాయి. భారతదేశం, రష్యాలు చమురు దిగుమతులు సహా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూపాయలు , రూబుల్‌లలో పరిష్కరించుకుంటున్నారు. టర్కీ, రష్యా, ఇరాన్ కూడా డాలర్ ఆంక్షలను నివారించడానికి స్థానిక కరెన్సీ వాణిజ్య ఒప్పందాలలో పాల్గొంటున్నాయి. ఇతర ద్వైపాక్షిక స్థానిక కరెన్సీ వాణిజ్య ఒప్పందాలు బ్రెజిల్, చైనా, అర్జెంటీనా కొన్ని వాణిజ్య ఒప్పందాలను బ్రెజిలియన్ రియల్ లేదా యువాన్‌లో పరిష్కరించుకుంటున్నాయి. దక్షిణాఫ్రికా, నైజీరియా వంటి కొన్ని ఆఫ్రికన్ దేశాలు ప్రాంతీయ బ్లాక్‌లలో స్థానిక కరెన్సీ వాణిజ్య ఏర్పాట్లను అన్వేషిస్తున్నాయి. సౌదీ అరేబియా, చైనా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి యువాన్ ఆధారిత చమురు వాణిజ్యం గురించి చర్చలు జరుపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వాణిజ్య కూటములు (ట్రేడ్ బ్లాక్‌లు) ప్రత్యామ్నాయ కరెన్సీల గురించి ఆలోచిస్తున్నాయి. బ్రిక్స్ ట్రేడ్ బ్లాక్ (బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికా, విస్తరిస్తున్న సభ్యులు) డాలర్‌ను దాటవేయడానికి ఇంట్రాబ్లాక్ వాణిజ్యంకోసం ఒక సాధారణ లేదా పూల్ కరెన్సీ గురించి చురుకుగా చర్చిస్తోంది. యూరోపియన్ యూనియన్ (ఇయు) యూరో కరెన్సీ డాలర్‌కు సహజ ప్రత్యామ్నాయం. ఇది ఇప్పటికే ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక రంగంలో విస్తృతంగా ఉపయోగించబడుతోంది. డాలర్ ఆధారిత ఆంక్షలకు గురికావడాన్ని తగ్గించడానికి ప్రపంచ ఇంధన మార్కెట్లు, ఆర్థిక లావాదేవీలలో యూరో పాత్రను విస్తరించడానికి యూరోపియన్ యూనియన్ ఒత్తిడి చేస్తోంది. ఆగ్నేయాసియా దేశాల సంఘం దేశాలు ప్రాంతీయ వాణిజ్యాన్ని పెంచడానికి, కరెన్సీ ప్రమాదాన్ని తగ్గించడానికి స్థానిక కరెన్సీ పరిష్కార విధానాలను ప్రోత్సహిస్తున్నాయి. AూజుAచీ వాణిజ్యంలో చైనీస్ యువాన్, ఇతర ప్రాంతీయ కరెన్సీల వినియోగాన్ని పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ఆఫ్రికన్ దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించడానికి, విదేశీ కరెన్సీలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి స్థానిక ఆఫ్రికన్ కరెన్సీలలో వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి మార్గాలను అన్వేషిస్తోంది. లాటిన్ అమెరికన్ బ్లాక్స్ మెర్కోసూర్ (ఉదా.బ్రెజిల్, అర్జెంటీనా) ద్వైపాక్షిక వాణిజ్యంకోసం బ్రెజిలియన్ రియల్, అర్జెంటీనా పెసో, చైనీస్ యువాన్‌లను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. AూఒA (బొలివేరియన్ అలయన్స్) దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నాయి. బ్రిక్స్ దేశాలు సమీప భవిష్యత్తులో ఒక సాధారణ కరెన్సీని ప్రవేశపెడితే, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), గోల్డ్‌న్ సాచ్స్ వంటి ప్రముఖ ఆర్థిక సంస్థలు ప్రపంచ విదేశీ మారక నిల్వలలో అమెరికా డాలర్ వాటా వచ్చే దశాబ్దంలో 10 20% తగ్గవచ్చని అంచనా వేస్తున్నాయి. అంటే దాదాపు 58% నుండి 38 48% మధ్యకు తగ్గే అవకాశం ఉంది. అయినప్పటికీ డాలర్ దాని ద్రవ్యత, సంస్థాగత విశ్వాసం, ప్రపంచ ఆర్థికంలో పాత్ర కారణంగా ప్రపంచ ఆధిపత్య కరెన్సీగా ఉంటుందని భావిస్తున్నారు. డాలర్ పతనం కాకుండా క్రమంగా క్షయం మాత్రమే ఉంటుంది. ఇది డాలర్‌ను పూర్తిగా భర్తీ చేయడం కంటే బహుళ ప్రామాణిక కరెన్సీ వ్యవస్థ వైపు అడుగులు వేయడాన్ని తెలియజేస్తున్నది. 2024 25 ఆర్థిక సంవత్సరం నాటికి, భారతదేశం అమెరికా బలమైన ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాన్ని కొనసాగించాయి. మొత్తం వాణిజ్యం విలువ 131.84 బిలియన్ డాలర్లు. అమెరికాకు భారతదేశం ఎగుమతులు 86.51 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది గత సంవత్సరం కంటే 11.6% పెరుగుదలను సూచిస్తున్నది. అయితే అమెరికా నుండి దిగుమతులు 7.44% పెరిగి 45.33 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయి. దీని ఫలితంగా భారతదేశానికి 41.18 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు లభించింది. ఇది ఆర్థిక సంబంధాల బలాన్ని నొక్కి చెబుతున్నది. భవిష్యత్తులో, వివిధ రంగాలలో సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో రెండు దేశాలు 2030 నాటికి తమ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. అయితే, ఆగస్టు 2025 లో భారత ఎగుమతులపై అమెరికా 50% సుంకం విధించడం వంటి ఇటీవలి పరిణామాలు దీనిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా తన స్థానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీల వైపు వ్యూహాత్మక, చురుకైన పాత్ర పోషించాలి. బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యురాలిగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రభావవంతమైన ఆర్థిక వ్యవస్థగా, భారతదేశం ద్వైపాక్షిక, బహు పాక్షిక వాణిజ్య ఒప్పందాలలో ముఖ్యంగా తోటి బ్రిక్స్ దేశాలు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని కీలక భాగస్వాములతో భారత రూపాయిని ఉపయోగించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఆర్థిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, కరెన్సీ స్వాప్ ఏర్పాట్లను ప్రోత్సహించడం, వ్యాపారాలను రూపాయలలో ఇన్‌వాయిస్ చేయడానికి ప్రోత్సహించడం ద్వారా, భారతదేశం తన కరెన్సీపై నమ్మకాన్ని పెంచుకోవడంలో సహాయపడుతుంది. అదే సమయంలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ప్రపంచ ఆర్థిక సంస్థలు, అభివృద్ధి చెందిన మార్కెట్లతో బలమైన సంబంధాలను కొనసాగించడంద్వారా భారతదేశం ఈ మార్పును సమతుల్యం చేసుకోవాలి. అంతిమంగా, భారతదేశం తన సొంత ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుంటూ ప్రపంచ ఆర్థిక స్థితిస్థాపకతను పెంచే బహుళ ప్రామాణిక కరెన్సీ వ్యవస్థ వైపు నడిపించడంలో భారతదేశం పాత్ర ప్రధానంగా ఉండాలి. డాలర్ జోక్యంలేని ప్రపంచ వ్యాపార వాతావరణం మరింత వికేంద్రీకృత, బహుళ ధ్రువ ఆర్థిక వ్యవస్థ వైపు లోతైన మార్పును సూచిస్తుంది. అయితే, ఇది పెరిగిన కరెన్సీ అస్థిరత, అధిక లావాదేవీ ఖర్చులు, సంక్లిష్ట మారకపు రేటు ప్రమాదాలకు కూడా దారితీయవచ్చు, ఎందుకంటే ఏ ఒక్క కరెన్సీ కూడా డాలర్ ప్రస్తుతం అందిస్తున్నట్లుగా ద్రవ్యత, స్థిరత్వాన్ని అందించదు. ప్రపంచ ఆర్థికంపై ఈ వైవిధ్యీకరణ, క్రాస్‌కరెన్సీ వాణిజ్యం, ఆర్థిక సంక్లిష్టతలను సమర్థవంతంగా నిర్వహించడానికి కొత్త అంతర్జాతీయ చట్రాలు సహకారం అవసరం.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మంచి ఛాన్స్ మిస్సవుతున్న పవన్

'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా స్థాయిలో వెలిగిపోవాలని ప్రతి స్టార్ హీరో ఆశపడ్డవాడే. కానీ అందరికీ కాలం కలిసి రాలేదు. పాన్ ఇండియా లేబుల్ వేసుకుని వచ్చిన చాలా సినిమాలు దారుణమైన ఫలితాలు అందుకున్నాయి. కొన్ని చిత్రాలకూ దేశవ్యాప్తంగా అనూహ్యమైన ఆదరణ దక్కి హీరోలకు ఊహించని ఫాలోయింగ్ వచ్చింది. రాజకీయాల్లోకి వెళ్లాక సినిమాల మీద ఫోకస్ తగ్గించినప్పటికీ ఆయన కొన్ని పాన్ ఇండియా ప్రయత్నాలు చేశారు. సర్దార్ గబ్బర్ సింగ్, హరిహర వీరమల్లు చిత్రాలతో తెలుగేతర భాషల వాళ్లనూ ఆకట్టుకోవాలని చూశారు. కానీ ఆ సినిమాల్లో కంటెంట్ బలంగా లేకపోవడంతో పాన్ ఇండియా రిలీజ్ నామమాత్రం అయింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సరిగా ఆడని ఈ చిత్రాలు.. మిగతా చోట్ల ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. ఐతే పవన్ పాన్ ఇండియా లాంచింగ్‌కు సరైన సినిమా చేతిలో ఉన్నప్పటికీ.. ఇప్పుడు ఆ దిశగా ప్లానింగ్ సరిగా లేకపోవడం అభిమానులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. ఓజీ.. పవన్ కెరీర్లోనే అత్యధిక హైప్‌తో వస్తున్న సినిమా. ఈ సినిమా కోసం అభిమానులు ఊగిపోతున్నారు. యుఎస్‌లో ఈ సినిమాకు రెండు వారాల ముందే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. ఆల్రెడీ ఈ చిత్రం మిలియన్ మార్కును దాటేసింది. కల్కి, పుష్ప లాంటి చిత్రాల కంటే వేగంగా ఆ మార్కును అందుకుందీ చిత్రం. తెలుగు రాష్ట్రాల్లో బుకింగ్స్ ఓపెన్ చేసినా రచ్చ మామూలుగా ఉండదని అర్థమవుతోంది. ఈ సినిమా ప్రోమోలు చూసి ఇతర భాషల వాళ్లు కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కానీ 'ఓజీ' పాన్ ఇండియా రిలీజ్ విషయంలో మేకర్స్ అంత సీరియస్‌గా ఉన్నట్లు లేరు. ఇతర భాషల్లో అసలు ప్రమోషన్ అన్నదే లేదు. హిందీలో చాలా లిమిటెడ్ రిలీజ్ ఉండబోతోందీ సినిమాకు. ఓటీటీ విండో 8 వారాల్లోపు ఉండడంతో నార్త్ మల్టీప్లెక్సులు ఈ సినిమాను ప్రదర్శించబోవు. లేక లేక పవన్ నుంచి అభిమానులు ఆశించే బలమైన కంటెంట్ ఉన్న, హీరోయిక్ మూవీ వస్తుంటే.. దీన్ని ఇతర భాషల్లో సరిగా రిలీజ్ చేయకపోవడం, ప్రమోట్ చేయకపోవడం పట్ల అభిమానుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అసలు తెలుగులో కూడా ఈ సినిమాను సరిగా ప్రమోట్ చేయట్లేదు. దీనికి ఉన్న హైప్ దృష్ట్యా తెలుగులో పబ్లిసిటీ లేకపోయినా పర్వాలేదు. కానీ ఇలాంటి సినిమాకు పాన్ ఇండియా రిలీజ్, ప్రమోషన్ ప్లానింగ్ లేకపోవడం చూస్తే మంచి ఛాన్స్ మిస్సవుతున్నట్లే కనిపిస్తోంది.



# అవరాపన్' సీక్వెల్‌లో దిశా పటాని ఫిక్స్?

బాలీవుడ్ యంగ్ బ్యూటీ దిశా పటాని గత ఏడాది 'కల్కి'తో సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. ఈ అమ్మడు వెల్‌కమ్ టూ ది జంగిల్, మలంగ్-2, సంఘమిత్ర వంటి చిత్రాల్లో కనిపించబోతుంది. షూటింగ్స్‌లో పాల్గొంటూ ఫుల్ బిజీ అయిపోయింది. ఈ క్రమంలో.. తాజాగా,దిశా పటాని ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ హాట్ బ్యూటీ 'అవరాపన్-2'లో హీరోయిన్‌గా కనిపించనున్నట్లు టాక్. ఈ మూవీ స్టోరీ చిత్రబృందం దిశా పటానికి చెప్పగా.. అది నచ్చడంతో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఇందులో ఇమ్రాన్ హష్మీ హీరోగా నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా 'అవరాపన్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ, భావోద్వేగాలతో 'అవరాపన్-2' రాబోతుండగా.. నితిన్ కక్కర్, ముఖేష్ భట్ తెరకెక్కిస్తున్నారు. విశేష్ భట్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా.. జనవరి నాటికి పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 3న థియేటర్స్‌లోకి రాబోతుంది.

# మళ్లీ హీరోగా సునీల్ సినిమా

ఒక సమయంలో బ్రహ్మానందంను కూడా వెనక్కి నెట్టి టాలీవుడ్లో నంబర్ వన్ కమెడియన్‌గా ఒక వెలుగు వెలిగాడు సునీల్. కానీ 'అందాల రాముడు'తో అనుకోకుండా హీరోగా మారి హిట్టు కొట్టిన అతను.. ఆ తర్వాత పూల రంగడు, మర్యాద రామన్న చిత్రాలతోనూ విజయాలు అందుకోవడంతో కామెడీ వేషాలు వదిలేసి సీరియస్‌గా హీరో వేషాల మీదే ఫోకస్ పెట్టాడు. కానీ ఈ ఆలోచనే ఒక దశలో తన కెరీర్‌ను ప్రశ్నార్థకం చేసింది. హీరోగా వరుసగా ఫెయిల్యూర్లు ఎదుర్కొని రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది తన పరిస్థితి. దీంతో ఒక దశ దాటాక హీరో వేషాలు వదిలేసి మళ్లీ కామెడీ ట్రై చేశాడు. అవి వర్కవుట్ కాకపోతే క్యారెక్టర్, విలన్ వేషాల వైపు మళ్లాడు. అవి కొంతమేర క్లిక్ అయి ఇప్పుడు తన కెరీర్ బాగానే నడుస్తోంది. ఐతే సునీల్‌ను ఇక మళ్లీ హీరో వేషాల్లో చూడలేమనే అంతా అనుకుంటున్న సమయంలో అతను లీడ్ రోల్‌లో ఒక సినిమా చేస్తున్న విషయాన్ని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ వెల్లడిరచారు. తమ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్లో తెరకెక్కుతున్న కొత్త చిత్రాల గురించి వివరిస్తూ.. సునీల్‌తో 'మర్యాద కృష్ణయ్య' అనే సినిమా గురించి ప్రస్తావించారు విశ్వప్రసాద్. ఈ ఏడాదే ఆ సినిమా రిలీజవుతుందని కడూ ఆయన ప్రకటించారు. ఐతే ఇదేమీ కొత్త చిత్రం కాదు. నాలుగేళ్ల కిందట ఈ సినిమాను అనౌన్స్ చేశారు. 'మర్యాద రామన్న'లో సునీల్‌కు జోడీగా నటించిన సలోనినే



ఇందులో కూడా హీరోయిన్. 'మనసంతా నువ్వే' దర్శకుడు వి.ఎన్.ఆదిత్య ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఈ మూవీ షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. కానీ ఏవో కారణాలతో విడుదల కాలేదు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ చిన్న బేనర్‌గా ఉన్నపుడు వేరే నిర్మాతలతో కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు విశ్వప్రసాద్. కానీ ఇప్పుడా సంస్థ టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బేనర్స్‌లో ఒకటిగా ఎదిగింది. రెండంకెల సంఖ్యలో సినిమాలు నిర్మిస్తోంది.

# అందురూ నన్ను సూపర్ హీరో అని పిలుస్తుంటే గర్వంగా ఉంది

మలయాళ యంగ్ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ఇటీవల 'లోకా చాప్టర్ 1 చంద్ర' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ మూవీ విమర్శలు అనుకున్నప్పటికీ భారీ కలెక్షన్లు రాబడుతూ బాక్సాఫీసును షేక్ చేస్తోంది. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కళ్యాణి ప్రియదర్శన్ ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ''అందరు నన్ను ఫిమేల్ సూపర్ హీరో అని పిలుస్తుంటే చాలా సంతోషంగా అనిపిస్తుంది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. నాకు చాలా గర్వంగా ఉంది. 'లోకా చాప్టర్ 1' విజయం సాధించడానికి మా టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. నేను ఈ సినిమాకు సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని అనుకున్నాను. ఈ సినిమా మొత్తాన్ని నా భుజాలపై వేసుకొని మోసానంటూ అందరూ అభినందిస్తున్నారు. కానీ మా టీమ్ అంతా ఆడ, మగ తేడా లేకుండా కష్టపడ్డారు. 'లోక చాప్టర్ 1' మొదటి ఫిమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రలోనైనా నటించగలరని నమ్ముతున్నారు'' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# అనుష్క ఏదో ఒకటి తేల్చేయాలి

తాను బయట కనిపించకపోయినా పర్లేదు తెరమీద దర్శనమిస్తే చాలు టికెట్లు కొనే జనాలున్నారన్న అనుష్క అంచనాలను ఘాటీ పూర్తిగా మాయం చేసింది. వచ్చిన కాసిన్ని ఓపెనింగ్స్ ఆమె ఖాతాలోకే వేసినా అవి కూడా మరీ తీసికట్టుగా ఉండటం ఆలోచించాల్సిన విషయం. ఆచార్య, ఆఫీసర్, రూలర్ లాంటి డిజాస్టర్లతో పోలుస్తున్నారంటే సినిమా ఏ స్థాయిలో ఆడిరదో అర్థం చేసుకోవచ్చు. ఆడియో రూపంలో స్వీటీ చేసిన పబ్లిసిటీ వల్ల ఏ ఉపయోగం కలగలేదు. ఇప్పుడు తన నుంచి వస్తున్న నెక్స్ట్ మూవీ మలయాళంలో తీసిన కథనర్. ఇది పీరియాడిక్ డ్రామా. తెలుగులోనూ డబ్బింగ్ చేసి సమాంతరంగా వదులుతారు.ఇక అనుష్క ఏదో ఒకటి తేల్చుకునే టైం అయితే వచ్చేసింది. సినిమాలు కొనసాగించాలంటే స్పీడ్ పెంచాలి. నాలుగు పదుల వయసు వచ్చినా ఇంకా పెళ్లి చేసుకోకపోవడం తన వ్యక్తిగత విషయం. ఆ మాటకొస్తే త్రిష లాంటి వాళ్ళు కూడా ఈ క్లబ్బులో ఉన్నారు. ఇప్పటికీ చేతి నిండా నాలుగైదు సినిమాలతో ఆమె బిజీగా ఉంది. కానీ అనుష్క సంగతి వేరు. మీడియా కెమెరాల ముందుకు రావడం లేదు. తన రూపం కోసం ఆలా చేస్తోందా లేక ఇంకేమైనా కారణాలున్నాయా అనేది తెలియలేదు, ఇకపై తన దగ్గరికి వచ్చే కథలు, దర్శకులను వెయిట్ చేయించకుండా త్వరగా నిర్ణయాలు తీసుకుంటే కెరీర్ బాగుటుంది. ఘాటీలో అనుష్క మరీ బ్యాడ్ గా అనిపించలేదు. కొంచెం బొద్దుగా ఉన్నా చూడబుల్ గా ఉంది. కొన్ని సీన్స్ లో బాగా పెర్ఫార్మ్ చేసింది కూడా. అలాంటప్పుడు రెగ్యులర్ గా చేస్తూ ఉంటే ఆడియన్స్ తో కనెక్టివిటీ ఉంటుంది. ఎక్కువ గ్యాప్ తీసుకున్నా పాత స్థాయిలో ఆదరణ దక్కించుకునే వెసులుబాటు హీరోయిన్లకు ఉండదు. ఎనిమిదేళ్లు మేకప్ కి దూరంగా ఉన్నా చిరంజీవిని ఆదరించిన జనం విజయశాంతిని అదే స్థాయిలో రిసీవ్ చేసుకోలేకపోయారు. సో కంటిన్యూటీ చాలా అవసరం. మరి అనుష్క కనక ఫిల్మోగ్రఫీ పెంచుకునే ఉద్దేశంలో ఉంటే మాత్రం యువి క్రియేషన్స్ కాకుండా బయట సంస్థలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.



Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in